# పెన్ పవర్

PEN POWER 12 YEARS JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 262 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : చిత్తూరు మంగళవారం 29 సెప్టెంబర్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :262 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : CHITTOOR TUE 29 SEPTEMBER 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur




## ఏనుగుల సంచారంపై డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష

- చిత్తూరులో సంచరిస్తున్న ఏనుగులను అడవిలోకి మళ్లించాలని పవన్ కల్యాణ్ ఆదేశం
- ఆపరేషన్ కోసం ముసలమడుగు నుంచి కుంకీ ఏనుగులను తీసుకురావాలని సూచన
- పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని స్పష్టం
- మానవ-ఏనుగు ఘర్షణలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం

**పెన్ పవర్ డెస్క్:**చిత్తూరు జిల్లాలోని పలు గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను, రైతులను భయాందోళనలకు గురిచ ేస్తున్న ఏనుగుల గుంపును వెంటనే అడవిలోకి సురక్షితంగా మళ్లించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ముసలమడుగు శిబిరం నుంచి కుంకీ ఏనుగులను రంగంలోకి దించాలని స్పష్టమైన సూచనలు జారీ చేశారు. సోమవారం పడిపుట్లబైలు సమీపంలో ఏనుగుల సంచారంపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.గత 15 రోజులుగా 11 ఏనుగులతో కూడిన గుంపు, దాని నుంచి విడిపోయిన మరో రెండు ఏనుగులు పడిపుట్లబైలు పంచాయతీ పరిధిలోని పుండ్లవల్లపల్లి, నడింపల్లి, కొండకిందపల్లి గ్రామాల్లో సంచరిస్తున్నాయని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ఏనుగులు వ్యవసాయ పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, ఒక ఏనుగుల గుంపు రహదారి దాటి మంగళంపేట బీట్‌లోకి ప్రవేశించగా, మరో రెండు ఏనుగులు చిత్తూరు వైపు కదులుతున్నాయని

- మిగతా 2లో

## మంగళగిరిలో 372 మందికి ఇంటి పట్టాలు పంపిణీ

- కుంచనపల్లిలో 372 మందికి ఉచితంగా ఇంటి పట్టాలు పంపిణీ చేసిన మంత్రి నారా లోకేశ్
- ఇప్పటికే రెండు విడతల్లో 5,636 మందికి పట్టాలు అందించినట్లు వెల్లడి
- రూ.2 వేల కోట్ల విలువైన భూములకు ఆస్తి హక్కులు కల్పించినట్లు ప్రకటన
- వచ్చే ఏడాది 100 పడకల ఆసుపత్రి అందుబాటులోకి తెస్తామని హామీ
- 2029 నాటికి నియోజకవర్గంలోని అర్హులందరికీ పట్టాలు అందిస్తామని లోకేశ్ వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**మంగళగిరి నియోజకవర్గంలో 80 శాతం పట్టాల సమస్య పరిష్కారమైందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కుంచనపల్లిలో 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో భాగంగా 372 మందికి ఉచితంగా ఇంటి పట్టాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన మెజారిటీ కారణంగానే నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు సొంత నిధులు కూడా ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు."ఇప్పటికే రెండు విడతల్లో 5,636 మందికి పట్టాలు ఇచ్చి రూ.2 వేల కోట్ల విలువైన భూములకు ఆస్తి హక్కులు కల్పించాం. మంగళగిరిలో పునాది వేసిన ఈ కార్యక్రమాన్ని విశాఖ,

- మిగతా 2లో

## ప్రతిభకు ప్రోత్సాహం.. అంధుల క్రికెట్‌కు మంత్రి నారా లోకేశ్ భరోసా

- మంత్రి లోకేశ్‌తో సమావేశమైన భారత అంధుల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజయ్ రెడ్డి
- ఏపీలో అంధుల క్రికెట్‌ను బలోపేతం చేయడంపై కీలక చర్చ
- క్రీడాకారులకు పూర్తి మద్దతు ఇస్తామని లోకేశ్ భరోసా
- అంధ క్రికెటర్ల కోసం ప్రత్యేక మైదానాలు ఏర్పాటు చేస్తామని హామీ
- వారి ప్రతిభ, సంకల్పానికి అండగా నిలుస్తామన్న మంత్రి

- మిగతా 2లో





## బంగాళాఖాతంలో మరో వాయుగుండం.. ఏపీకి వర్ష సూచన

- కోస్తాంధ్ర, రాయలసీమలో తేలికపాటి వర్షాల అంచనా
- గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం
- రానున్న 72 గంటల్లో బంగ్లాదేశ్ వైపు తీరం దాటే సూచన
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక

- మిగతా 2లో




## తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత

- నాలుగేళ్ల నిరంతర విద్య నిబంధన తప్పనిసరి అని పునరుద్ఘాటన
- స్థానికతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- రాష్ట్రపతి ఉత్తర్వులను, తెలంగాణ జీవోను సమర్థించిన న్యాయస్థానం

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణలో స్థానికత (లోకల్ స్టేటస్) అర్హత సాధించడానికి నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాస నిబంధన తప్పనిసరి అని సుప్రీంకోర్టు మరోసారి

- మిగతా 2లో

## జగన్ పాలనలో బీసీలకు ద్రోహం

- జగన్ పాలనలో బీసీలకు తీవ్ర ద్రోహం జరిగిందన్న మంత్రి కొల్లు రవీంద్ర
- బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామని ప్రకటన
- 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి కుదించారని వైసీపీ ప్రభుత్వంపై విమర్శ
- బీసీల అభ్యున్నతికి బడ్జెట్‌లో రూ.32,534 కోట్లు కేటాయించామని వెల్లడి
- కూటమి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల పునరుద్ధరణకు చిత్తశుద్ధితో ఉందని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**జగన్ ప్రభుత్వ హయాంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వారికి అన్ని విధాలా అండగా నిలుస్తోందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సోమవారం

- మిగతా 2లో

## 15 వేల ప్రమోషన్లు ఇచ్చాం.. ఇంకా ధర్నాలెందుకు?

### సచివాలయ ఉద్యోగుల డిమాండ్లపై మంత్రి స్వామి

- ఉద్యోగులను వైఎస్ జగన్ రెచ్చగొడుతున్నారని మంత్రి స్వామి ఆరోపణ
- అక్రమ ధర్నాలు, ఒత్తిళ్లు సహించేది లేదని హెచ్చరిక
- నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టీకరణ
- రెండు క్యాజువల్ లీవులకు ఉన్నతాధికారుల అనుమతి అవసరం లేదన్న మంత్రి



**పెన్ పవర్ డెస్క్:**గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇప్పటికే 15 వేల మందికి పైగా ప్రమోషన్లు ఇచ్చామని, సమస్యలు పరిష్కరిస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని రాష్ట్ర మంత్రి డీఎస్‌బీవీ స్వామి స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అక్రమంగా ధర్నాలు చేస్తే సహించేది లేదని

- మిగతా 2లో



## ఆరో తరగతికి త్రిభాషా విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలి

**పెన్ పవర్ డెస్క్:** సీబీఎస్ఈ బోర్డు పరిధిలో ప్రస్తుతం 6వ తరగతి చదువుతున్న విద్యార్థులకు త్రిభాషా విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలని సుప్రీం కోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. ఈ ఏడాది 7, 8, 9వ తరగతి విద్యార్థులకు కల్పించినట్లుగానే ఈ విధానం నుంచి ఆరో తరగతికి కూడా మినహాయింపు ఇవ్వాలని ఆదేశించింది. 2027 ఏప్రిల్ 1 నుంచి త్రిభాషా విధానాన్ని అమలు చేయాలని సూచించింది. సీబీఎస్ఈ త్రిభాషా విధానంలోని అంశాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలు జారీ చేసింది. అకస్మాత్తుగా సీబీఎస్ఈ భాషా విధానం మార్చడంపై సుప్రీం కోర్టు పలు ప్రశ్నలు లేవనెత్తింది. ఇప్పటికే ఇతర భాషలు ఎంచుకున్న విద్యార్థులు మధ్యలో మరో భాషకు మారాలంటే ఇబ్బంది పడే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఈ విషయంపై పిటిషన్ దాఖలు చేసిన పాఠశాలలను

- మిగతా 2లో

## యూపీఐ ఛార్జీలపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ.. అక్టోబర్ 15 నుంచి అమలు

- యూపీఐ లావాదేవీలపై 0.4% ఛార్జీల విధింపుపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ
- అక్టోబర్ 15 నుంచి కొత్త నిబంధనల అమలుకు మార్గం సుగమం
- రూ.2,000 దాటిన మర్చంట్ చెల్లింపులపై మాత్రమే ఈ ఛార్జీ వర్తింపు
- సాధారణ, వ్యక్తిగత లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవని స్పష్టత
- ఛార్జీల విధింపుపై వివరణ ఇవ్వాలని కేంద్రం, ఆర్‌బీఐకి కోర్టు నోటీసులు

**పెన్ పవర్ డెస్క్:**యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే నిర్దిష్ట లావాదేవీలపై 0.4% ఛార్జీలు విధించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అక్టోబర్ 15 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో వాటిని నిలిపివేయాలని దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై నేడు విచారణ చేపట్టింది. ఈ నిర్ణయంతో షెడ్యూల్ ప్రకారమే కొత్త ఛార్జీల అమలుకు మార్గం సుగమమైంది.ప్రధాన న్యాయమూర్తి

- మిగతా 2లో



## హైదరాబాద్‌లో మళ్లీ చెడ్డీ గ్యాంగ్ కలకలం..

- హైదరాబాద్ మణికొండలో చెడ్డీ గ్యాంగ్ ప్రత్యక్షం
- అపార్ట్‌మెంట్‌లో చోరీకి పాల్పడి మహిళపై దాడి
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ముఠా సభ్యుల వీడియోలు
- కేసు దర్యాప్తునకు మూడు ప్రత్యేక పోలీస్ బృందాల ఏర్పాటు
- సెక్యూరిటీ గార్డుల పాత్రపై ఆరా తీస్తున్న పోలీసులు

2లో



## కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం.. నవంబర్ 1 నుంచి కఠిన నిబంధనలు

- ఢిల్లీలో వాయు కాలుష్య నియంత్రణకు ముందస్తు చర్యలు
- నవంబర్ 1 నుంచి రెట్టింపు కానున్న పార్కింగ్ ఛార్జీలు
- ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశాలు
- నిర్మాణ, కూల్చివేత పనులపై పూర్తిగా నిషేధం
- ఫిబ్రవరి 28 వరకు అమలులో ఉండనున్న నిబంధనలు

- మిగతా 2లో



## 'తాయ్ మామన్' పథకానికి శ్రీకారం.. మేనమామలా మారిన సీఎం విజయ్

- 'తాయ్ మామన్' గోల్డ్ రింగ్ పథకాన్ని ప్రారంభించిన సీఎం విజయ్
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరం
- మధురై రాజాజీ ఆసుపత్రిలో చిన్నారులకు స్వయంగా ఉంగరాలు తొడిగిన సీఎం
- కొందరు చిన్నారులకు సంప్రదాయబద్ధంగా నామకరణం కూడా చేసిన విజయ్

- మిగతా 2లో






## జనసేన దూకుడు.. బలం ఎవరిది ఎంతో తెలుస్తుందా?

జనసేన ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల షేరింగ్ పై పట్టుబట్టే అవాకశముంది. లేదంటే స్నేహపూర్వక పోటీ చేస్తామని బహిరంగంగానే ప్రకటించింది. ఈ నేపథ్యంలో జనసేన డిమాండ్లకు టీడీపీ నుంచి సానుకూలత వస్తుందా? లేదా? అన్నది కూడా ఏపీలో చర్చనీయాంశమైంది. ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, ప్రాంతాల వారీగా పటిష్ట వ్యూహంతో ముందుకు వెళ్లాలని ఎ జనసేన నిర్ణయించింది. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మరియు రాజకీయ వ్యవహారాల కమిటీ మార్గదర్శకాల ప్రకారం జనసేన అనుసరిస్తున్న ప్రధాన వ్యూహాలు ఎలా ఉంటాయన్నది ఇప్పుడు కూటమిలోని మిత్రుల మధ్య చర్చనీయాంశమైంది. ఎక్కువ మంది టీడీపీ ఎమ్మెల్యేలున్నారు. వారు తమ నియోజకవర్గం పరిధిలో జనసేనకు వాటా ఇచ్చేందుకు అంగీకరించరు. హైకమాండ్ బలవంతం పై బయటకు అంగీకరించినా ఎన్నికల్లో మనస్ఫూర్తిగా పనిచేయరు.

**టీడీపీ, జనసేన సోషల్ మీడియా వార్...**

జనసేన పార్టీ తమకు ప్రాధాన్యత కల్పించకపోతే పోటీకి దిగుతామని ప్రకటించింది. అయితే పోటీకి దిగితే ఎవరి బలం ఏంటో బయటపడుతుందని కొందరు టీడీపీ అభిమానులు సోషల్ మీడియా వేదికగా అప్పుడే జనసేన పై కామెంట్స్ చేస్తున్నారు. 2014, 2024 ఎన్నికల్లో కూటమి గెలుపునకు తామే కారణమని చెప్పుకుంటూ తిరుగుతున్న జనసేన నోరు మూయించాలంటే ఒకరకంగా ఒంటరిగా ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయనిస్తే అసలు బలం తెలుస్తోందని కొందరు నేరుగా కామెంట్స్ పెడుతున్నారు. దీంతో రెండు పార్టీల మధ్య సోషల్ మీడియా వార్ మొదలయినట్లే కనిపిస్తుంది. ఒకవేళ హైకమాండ్ నిర్ణయం తీసుకున్నా క్షేత్రస్థాయిలో కలసి పనిచేసే అవకాశాలు మాత్రం ఒకరికొకరు కనిపించని పరిస్థితి ఆల్రెడీ ఇప్పటికే ఏర్పడిందన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా. ఇది వైసీపీకి కొంత మేరకు ప్రయోజనం చేకూరుతుందన్న భయం ఉన్నప్పటికీ ఎవరి బలం? ఏంటో తెలిస్తేనే ..గుప్పిట తెరిస్తేనే కదా? అంటున్నారు టీడీపీ నేతలు. ఇలా స్థానిక సంస్థల ఎన్నికలలో మిత్రుల మధ్య కొంత గ్యాప్ ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**జనసేన మాత్రం ముందుకే...**

మరొకవైపు జనసేన ప్రత్యేక కమిటీల ఏర్పాటు చేసింది. స్థానిక ఎన్నికల నిర్వహణ, సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను నియమించారు.పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఈ కమిటీలు పనిచేస్తాయి.గ్రామ, వార్డు స్థాయిల్లో పార్టీ యంత్రాంగాన్ని ఇవి బలోపేతం చేస్తాయి. అసెంబ్లీ ఎన్నికల నాటి ఫార్ములా కాకుండా, స్థానిక పరిస్థితులకు తగినట్లుగా వ్యూహం మార్చారు.ప్రతి ప్రాంతంలో పార్టీ సామాజిక, సంస్థాగత బలాలను అంచనా వేస్తున్నారు.గ్రౌండ్ రియాలిటీ ఆధారంగా పోటీ చేసే స్థానాలను ఖరారు చేస్తున్నారు. ప్రతిష్టాత్మకమైన మేయర్ మరియు కీలక స్థానాలపై జనసేన ప్రత్యేక దృష్టి పెట్టింది.పోటీ చేసే ప్రతి చోటా విజయమే లక్ష్యంగా శ్రేణులను సన్నద్ధం చేస్తున్నారు.కూటమి సమన్వయంకూటమి భాగస్వామ్య పక్షాలతో సమన్వయ కమిటీల ద్వారా చర్చలు జరుపుతున్నారు.సీట్ల సర్దుబాటు మరియు కేటాయింపులపై పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నిర్ణయమే తుదినిర్ణయంగా ఉంటుందని స్పష్టం చేశారు. మరి చివరకు ఏం జరుగుతుందన్నది చూడాలి.

## హైదరాబాద్‌లో మళ్లీ చెడ్డీ గ్యాంగ్ కలకలం..

హైదరాబాద్ నగరంలో మరోసారి చెడ్డీ గ్యాంగ్ కలకలం రేపింది. మణికొండలోని ఒక అపార్ట్‌మెంట్‌లోకి చొరబడిన ఈ ముఠా సభ్యులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.వివరాల్లోకి వెళితే, నిన్న తెల్లవారుజామున మణికొండలోని ఓ అపార్ట్‌మెంట్‌లోకి చెడ్డీ గ్యాంగ్ సభ్యులు ప్రవేశించారు. నివాసంలోకి చొరబడి దొంగతనానికి పాల్పడుతుండగా, ఒక మహిళ వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ఆగ్రహించిన దుండగులు ఆమెపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఆరుగురు సభ్యులు అపార్ట్‌మెంట్‌లోని ఒక బ్లాక్‌లో సంచరిస్తున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. ఈ వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.

ఈ ఘటనపై సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు, స్థానిక సెక్యూరిటీ గార్డులకు ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనతో చుట్టుపక్కల అపార్ట్‌మెంట్ల వాసులు భయాందోళన చెందుతున్నారు.

## 'తాయ్ మామన్' పథకానికి శ్రీకారం.. మేనమామలా మారిన సీఎం విజయ్

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేడు మధురైలో 'తాయ్ మామన్' గోల్డ్ రింగ్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరాన్ని అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. మధురైలోని ప్రభుత్వ రాజాజీ ఆసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమం ద్వారా సీఎం విజయ్ ఈ బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టారు.బిస్కెట్ కలర్ చొక్కా, పంచె ధరించిన సీఎం విజయ్, వేదికపై ముగ్గురు శిశువులకు స్వయంగా బంగారు ఉంగరాలు తొడిగి పథకాన్ని ప్రారంభించారు. తల్లులను ఆప్యాయంగా కుర్చీల్లో కూర్చోబెట్టి, పక్కనే ఉండి చిన్నారుల వేళ్లకు జాగ్రత్తగా ఉంగరాలు తొడిగారు. అనంతరం ఆయన వేదిక దిగి కింద కూర్చున్న మరో 12 మంది తల్లులు, వారి శిశువుల వద్దకు వెళ్లారు. అక్కడ చిన్నారులను చేతుల్లోకి తీసుకుని, వారి తల్లిదండ్రులతో ఆప్యాయంగా మాట్లాడారు.ఈ సందర్భంగా కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు పేరు పెట్టాలని సీఎం విజయ్‌ను కోరారు. వారి అభ్యర్థనను మన్నించిన ఆయన, చిన్నారులను ఎత్తుకుని సంప్రదాయబద్ధంగా మూడుసార్లు పేరును ఉచ్ఛరించి నామకరణం చేశారు. ఈ భావోద్వేగపూరిత క్షణాల్లో అక్కడున్న వారంతా హర్షం వ్యక్తం చేశారు.

అనంతరం తల్లులతో సెల్ఫీలు దిగి, కరచాలనం చేసి వారిని ఉత్సాహపరిచారు. ఆ తర్వాత ఆసుపత్రిలోని ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ వార్డును సందర్శించి, అక్కడ మరో 10 మంది శిశువులకు బంగారు ఉంగరాలు అందించారు. వైద్యుల సమక్షంలో చిన్నారులతో, వారి తల్లిదండ్రులతో సరదాగా గడిపారు.అంతకుముందు ఉదయం 11 గంటలకు చెన్నై నుంచి మధురై విమానాశ్రయానికి చేరుకున్న సీఎం విజయ్‌కు పార్టీ కార్యకర్తలు, అభిమానులు వందలాదిగా తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. ఆయన కాన్వాయ్ ఆసుపత్రికి వెళ్లే దారి పొడవునా ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలు నిలబడి పూలవర్షం కురిపించారు. రాజాజీ ఆసుపత్రి వద్ద వాహనం దిగి, జనసందోహం మధ్య నడుచుకుంటూనే వేదిక వద్దకు చేరుకున్నారు. దారిలో ఆసుపత్రి సిబ్బంది, ప్రజలకు అభివాదం చేస్తూ, పలుచోట్ల ఆగి వారితో ఫొటోలు దిగారు. సీఎం రాకతో ఆసుపత్రి పరిసరాలు జనసంద్రంగా మారాయి.

# జగన్ పాలనలో బీసీలకు ద్రోహం

- మొదటి పేజి తరువాయి

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల పాలనలో బీసీలను వెన్నుపోటు పొడిచిన వైసీపీ నాయకులు, ఇప్పుడు దొంగ నాటకాలు ఆడుతున్నారని ఆయన మండిపడ్డారు.

వైసీపీ ప్రభుత్వం బీసీలను రాజకీయంగా అణగదొక్కే ఉద్దేశంతోనే స్థానిక సంస్థల్లో ఉన్న 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి కుదించిందని మంత్రి ఆరోపించారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16,800 మంది బీసీలు తమ రాజకీయ ప్రాతినిధ్యాన్ని కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, తమ ప్రభుత్వం బీసీలకు తిరిగి 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించేందుకు చిత్తశుద్ధితో ఉందని, ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి, అందుకు అనుగుణంగా కార్యాచరణను రూపొందిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

బీసీల రక్షణ కోసం ప్రత్యేకంగా "బీసీ రక్షణ చట్టాన్ని" తీసుకురానున్నట్లు కొల్లు రవీంద్ర ఈ సందర్భంగా ప్రకటించారు. నారా లోకేశ్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే ఈ చట్టానికి సంబంధించిన ముసాయిదా సిద్ధమైందని ఆయన వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీల

అభ్యున్నతి కోసం బడ్జెట్‌లో రూ.32,534 కోట్లను కేటాయించిందని, వారి ఆర్థిక స్వావలంబన కోసం పటిష్ఠమైన చర్యలు తీసుకుంటోందని వివరించారు. జగన్ పాలనలో బీసీలపై దాడులు జరిగినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని, తమ ప్రభుత్వం మత్స్యకారులు, చేనేత కార్మికులు, వడ్డెరలు వంటి అన్ని వర్గాలకు ప్రత్యేక పథకాల ద్వారా భరోసా కల్పిస్తోందని మంత్రి పేర్కొన్నారు.

## ప్రతిభకు ప్రోత్సాహం.. అంధుల క్రికెట్‌కు మంత్రి నారా లోకేశ్ భరోసా

ఆంధ్రప్రదేశ్‌లో అంధుల క్రికెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని, క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. భారత అంధుల క్రికెట్ జట్టుకు మూడు ప్రపంచకప్‌లు అందించిన మాజీ కెప్టెన్, అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డి సోమవారం మంత్రి లోకేశ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అంధుల క్రికెట్ ఎదుర్కొంటున్న సవాళ్లు, క్రీడాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై వారు సుదీర్ఘంగా చర్చించారు.ఈ భేటీ అనంతరం మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. అజయ్ కుమార్ రెడ్డిని కలవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. "ఆంధ్రప్రదేశ్‌లో అంధుల క్రికెట్‌ను మరింత బలోపేతం చేయడం, రాష్ట్ర, దేశ స్థాయిల్లో ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులకు మద్దతుగా నిలవడం, ప్రత్యేకించి దృష్టి లోపం ఉన్న క్రికెటర్ల కోసం ప్రత్యేక క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం వంటి కీలక అంశాలపై చర్చించాం" అని లోకేశ్ తెలిపారు.

అంధ క్రీడాకారుల ప్రతిభ, అకుంఠిత దీక్ష, వారు సాధించిన విజయాలు ఎంతో స్ఫూర్తిదాయకమని మంత్రి కొనియాడారు. "వారి ప్రతిభకు తగిన ప్రోత్సాహం, అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రభుత్వం వారికి అన్ని విధాలా అండగా నిలుస్తుంది" అని ఆయన తన పోస్టులో స్పష్టం చేశారు. అజయ్ రెడ్డి వంటి క్రీడాకారులతో నేరుగా చర్చించి, ప్రభుత్వపరంగా పూర్తి మద్దతు ప్రకటించడం పట్ల రాష్ట్రంలోని అంధ క్రీడా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

## కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం.. నవంబర్ 1 నుంచి కఠిన నిబంధనలు

ప్రతి ఏటా శీతాకాలంలో తీవ్ర వాయు కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వం ముందస్తు నియంత్రణ చర్యలకు ఉపక్రమించింది. కాలుష్య తీవ్రతను తగ్గించే లక్ష్యంతో 2026 నవంబర్ 1వ తేదీ నుంచి కఠిన నిబంధనలను అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా పార్కింగ్ ఛార్జీలను రెట్టింపు చేయడంతో పాటు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని తప్పనిసరి చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

కొత్త నిబంధనల ప్రకారం, నవంబర్ 1 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు కేవలం 50 శాతం సిబ్బందితోనే కార్యకలాపాలు సాగించాలి. మిగిలిన 50 శాతం మంది ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ వెసులుబాటు కల్పించాలని స్పష్టం చేసింది. వీటితో పాటు, నగర వ్యాప్తంగా భవన నిర్మాణ, కూల్చివేత పనులపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిషేధం విధించింది. వాహనాల వినియోగాన్ని నియంత్రించేందుకు ఈ కాలంలో పార్కింగ్ ఫీజులను కూడా రెట్టింపు చేయనున్నట్లు వెల్లడించింది.

శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పడిపోవడం, పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానాలలో పంట వ్యర్థాలను కాల్చడం, వాహన కాలుష్యం, నిర్మాణ రంగ ధూళి, దీపావళి బాణసంచా, పారిశ్రామిక ఉద్గారాల వంటి కారణాలతో ఢిల్లీ నగరం ప్రతి ఏటా గ్యాస్ ఛాంబర్‌ను తలపిస్తోంది. దట్టమైన పొగమంచు కారణంగా ప్రజలు శ్వాసకోశ సమస్యలు బారిన పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ చర్యల ద్వారా శీతాకాలంలో కాలుష్య తీవ్రతను కొంతమేరకైనా తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

## యూపీఐ ఛార్జీలపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ.. అక్టోబర్ 15 నుంచి అమలు

- మొదటి పేజి తరువాయి

సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఛార్జీల విధింపుపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) సహా ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ముఖ్యంగా ఈ కొత్త ఛార్జీల విధింపునకు గల ప్రాతిపదికను వివరిస్తూ అఫిడవిట్ సమర్పించాలని కేంద్రాన్ని కోరింది.

**కొత్త నిబంధనల ప్రకారం ఛార్జీల స్వరూపం**

సెప్టెంబర్‌లో జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రకారం, వ్యక్తుల నుంచి వ్యాపారులకు (పీ2పీ) చేసే రూ.2,000కు మించిన యూపీఐ లావాదేవీలపై 0.4% 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండీఆర్) వర్తిస్తుంది. రూ.75,000, ఆపైబడిన లావాదేవీలకు గరిష్ఠంగా రూ.300 ఛార్జీ ఉంటుంది. అయితే, ఈ ఛార్జీల ప్రభావం సాధారణ వినియోగదారులపై ఎక్కువగా ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**ఎవరికి మినహాయింపు?**

వ్యక్తుల మధ్య (పీ2పీ) జరిగే యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు.

వ్యాపారులకు చేసే రూ.2,000 లోపు చెల్లింపులు పూర్తిగా ఉచితం.

యూపీఐ క్యూఆర్ కోడ్‌ల ద్వారా నెలకు రూ.1 లక్ష వరకు చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు సున్నా-ఎండీఆర్ నిబంధన వర్తిస్తుంది.

అత్యావసర సేవలకు ఫ్లాట్‌గా రూ.5, క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలకు 0.02% చొప్పున తక్కువ ఛార్జీలు వర్తిస్తాయి.

**ఇది పన్ను కాదు, సెటిల్‌మెంట్ ఫీజు: కేంద్రం**

కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ వాదనలు వినిపిస్తూ,

ఈ కొత్త ఛార్జీల వల్ల దాదాపు 96% మర్చంట్ లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే పన్ను కాదని, కేవలం పేమెంట్ సిస్టమ్‌లో భాగమైన ఒక సెటిల్‌మెంట్ ఫీజు మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ ఛార్జీలు నేరుగా వినియోగదారుల నుంచి వసూలు చేయరని ఆయన వివరించారు. ప్రస్తుతం స్టే ఇచ్చేందుకు నిరాకరించినప్పటికీ, కేంద్రం ఇచ్చే వివరణ అనంతరం సుప్రీంకోర్టు ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకోనుంది.

## 15 వేల ప్రమోషన్లు ఇచ్చాం.. ఇంకా ధర్నాలెందుకు?

- మొదటి పేజి తరువాయి

ఆయన గట్టిగా హెచ్చరించారు.సోమవారం అమరావతిలో మంత్రి స్వామి మీడియాతో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల ఆందోళనలపై ప్రభుత్వ వైఖరిని వెల్లడించారు. గత ప్రభుత్వం సరైన సర్వీస్ రూల్స్ లేకుండా నోటిఫికేషన్లు ఇచ్చిందని, తమ ప్రభుత్వం వాటిని సరిదిద్దిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో సచివాలయ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించినట్లు వివరించారు. దీనిలో భాగంగా రెండు క్యాజువల్ లీవులను ఉన్నతాధికారుల అనుమతి లేకుండా వాడుకునే వెసులుబాటు కూడా కల్పించామని చెప్పారు.ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనల వెనుక ఎవరున్నారనే దానిపై విచారణ జరుపుతామని చెబుతూనే, ఈ ఆందోళనలకు జగనే కారణమని మంత్రి స్వామి ఆరోపించారు. "గతంలో రూ.15,000 జీతానికి రెండేళ్లు పనిచేసినప్పుడు నిరసన తెలపని వారు, ఇప్పుడు ఎందుకు ఆందోళన చేస్తున్నారని ప్రశ్నించారు. గత పీఆర్సీలో వీరిని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు?" అని నిలదీశారు.

కొన్ని డిమాండ్లపై మంత్రి స్పష్టత ఇచ్చారు. నోషనల్ ఇంక్రిమెంట్లు ఎవరికీ ఇవ్వడం సాధ్యం కాదని, కాబట్టి సచివాలయ ఉద్యోగులకు కూడా ఇవ్వలేమని తేల్చిచెప్పారు.ఐ

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగానే చూస్తున్నామని, గత ప్రభుత్వం నియమించిందన్న వివక్ష తమకు లేదని అన్నారు. వారి కోసం ప్రత్యేకంగా ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు చేసిందే తమ ప్రభుత్వమని గుర్తుచేశారు. వారి సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, అయితే ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

## మంగళగిరిలో 372 మందికి ఇంటి పట్టాలు పంపిణీ

- మొదటి పేజి తరువాయి

విజయవాడతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నాం. వచ్చే ఏడాది 100 పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తెస్తాం. రానున్న ఎన్నికల్లోగా ప్రతి ఇంటికీ తాగునీరు, భూగర్భ డ్రైనేజీ సౌకర్యం కల్పిస్తాం. కేంద్రం పరిధిలోని భూముల సమస్యలపై కూడా సంప్రదింపులు జరుపుతున్నాం. 2029 నాటికి నియోజకవర్గంలో అర్హులందరికీ పట్టాలు అందిస్తాం" అని లోకేశ్ తెలిపారు.

## ఆరో తరగతికి త్రిభాషా విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలి

- మొదటి పేజి తరువాయి

సంప్రదించి, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఇందుకోసం ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు.

## తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత

- మొదటి పేజి తరువాయి

స్పష్టం చేసింది. ఈ నిబంధన ఏకపక్షంగా ఉందంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ, రాష్ట్రపతి ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది.జెల్లా అంకిత అనే విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పి.ఎస్. నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్ల పాటు తెలంగాణలో విద్యాభ్యాసం చేసి ఉండాలన్న నిబంధనను పిటిషనర్ సవాల్ చేశారు. అయితే, ఈ వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సంబంధిత జీవోను సమర్థించింది.ఎంబీబీఎస్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు స్థానిక రిజర్వేషన్ పొందాలంటే, విద్యార్థి క్వాలిఫైయింగ్ పరీక్షకు ముందు కనీసం నాలుగేళ్ల పాటు తెలంగాణలోనే చదివి ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. గతంలో జస్టిస్ బి.ఆర్. గవాయ్ ధర్మాసనం వెలువరించిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, దానిని న్యాయస్థానం పునరుద్ఘాటించింది.ఈ తీర్పుతో తెలంగాణలో స్థానికతకు సంబంధించిన నిబంధనలపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడినట్లయింది. నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాసం అనే నిబంధన చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతుందని, దీనిని కచ్చితంగా పాటించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## ఏనుగుల సంచారంపై డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష

- మొదటి పేజి తరువాయి

అధికారులు పేర్కొన్నారు. ఈ ఏనుగుల సంచారం వల్ల పాకాల, పులిచెర్ల, చంద్రగిరి మండలాల ప్రజలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, మానవ-ఏనుగు ఘర్షణలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. "ఏనుగుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. అటవీ, పోలీసు, రెవెన్యూ, విద్యుత్ శాఖలు, హనుమాన్ బృందాలు సమన్వయంతో పనిచేయాలి. క్షేత్రస్థాయి బృందాలు నిరంతరం నిఘా ఉంచి, ప్రమాదం పొంచి ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలి" అని ఆయన స్పష్టం చేశారు.ఏనుగుల వల్ల పంట నష్టపోయిన రైతులకు తక్షణం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా చూసుకుంటూనే, ఏనుగులను సురక్షితంగా తిరిగి అటవీ ప్రాంతంలోకి మళ్లించే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. వన్యప్రాణుల సంరక్షణతో పాటు ప్రజల భద్రత, పంటల పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఉద్ఘాటించారు.

## బంగాళాఖాతంలో మరో వాయుగుండం.. ఏపీకి వర్ష సూచన

బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన వాయుగుండం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. దీని ప్రభావంతో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని అంచనా వేసింది.

మయన్మార్, అండమాన్ దీవుల సమీపంలో ఏర్పడిన ఈ వాయుగుండం, ప్రస్తుతం అండమాన్‌లోని మాయాబందర్‌కు 580 కిలోమీటర్ల దూరంలో తూర్పు-ఈశాన్య దిశలో కేంద్రీకృతమై ఉంది. ఇది వాయవ్య దిశగా బంగ్లాదేశ్ వైపు కదులుతోంది. రానున్న 12 గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా బలపడి, సుమారు 72 గంటల్లో బంగ్లాదేశ్ తీరాన్ని తాకవచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.ఈ వాయుగుండం ప్రభావంతో ప్రభావిత ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవలే ఉత్తరాంధ్ర తీరంలో కళింగపట్నం వద్ద ఒక తీవ్ర వాయుగుండం తీరం దాటడంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు, వరదలతో పంట నష్టం జరిగిన నేపథ్యంలో తాజా హెచ్చరిక ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఆత్మకూరు ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎన్డీఏ కూటమి ముఖ్య నేతలతో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రత్యేక భేటీ..

**టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో ఆత్మకూరు నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశం..**



**నెల్లూరు సెప్టెంబర్ 28 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

ఈ నెల 29న నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం రామాపురంలో 'పల్లె పండుగ-3' భారీ బహిరంగ సభ..

ఈ సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రులు, సీనియర్ నాయకులు హాజరు.సభ విజయవంతమే లక్ష్యంగా నియోజకవర్గాల నుంచి భారీ ప్రజల సమీకరణకు మంత్రి ఆనం ప్రణాళిక.మండలాలు, గ్రామాల వారీగా వాహనాల ఏర్పాటు, కూటమి శ్రేణుల సమన్వయంపై నాయకులకు మంత్రి దిశానిర్దేశం..సభను దిగ్విజయం చేసేందుకు కూటమి శ్రేణులు, అధికారులు భాగస్వాములు కావాలని ఆనం పిలుపు..

'విబి జి రామ్‌జీ' ఉపాధి హామీ నూతన పథకం ద్వారా గ్రామీణాభివృద్ధి వేగవంతం.ఉదయగిరి నియోజకవర్గం నుంచి దాదాపు లక్ష మంది బతుకుతెరువు కోసం వలస వెళ్లడం విచారకరం.

దిఆనం ఆవేదనవలసలను అరికట్టి స్థానికంగా ఉపాధి కల్పించడమే 'విబి జి రామ్‌జీ' పథకం ముఖ్య ఉద్దేశం..గ్రామీణ రోడ్ల కనెక్టివిటీ కోసం 6,000 కి.మీల విస్తరణ పనులకు2 ,700 కోట్లు కేటాయింపు.

గ్రామాల్లో బిటి రోడ్ల నిర్మాణానికి 2,500 కి.మీల మేర 1,750 కోట్లు ఖర్చు.తోటలు, ఉద్యానవన పంటల రవాణా సౌకర్యార్థం 4,000 కి.మీల రోడ్ల నిర్మాణానికి ₹3,800 కోట్లు.పాడి రైతులకు బాసటగా గ్రామీణ ప్రాంతాలలో మినీ గోకులాల నిర్మాణానికి ₹300 కోట్లు మంజూరు.భూగర్భ జలాల పునరుద్ధరణే లక్ష్యంగా 1,000 కి.మీల మ్యాజిక్ డ్రెయిన్లకు 110 కోట్లు.రాయలసీమ, మార్కాపురం, ఉత్తరాంధ్రలో ఉద్యానవన హబ్‌ల ఏర్పాటుకు ₹225 కోట్లు.గత ప్రభుత్వ హయాంలో అర్థాంతరంగా నిలిచిపోయిన పంచాయతీ భవనాల పూర్తికి ₹200 కోట్లు కేటాయింపు.గ్రామీణ రోడ్ల పునర్నిర్మాణం, రిపేర్ల కోసం నిధులు రూ.11,085 కోట్లుగా నిర్ధారణ.గత ఏడాది చేపట్టిన సచివాలయాలు, కమ్యూనిటీ హాళ్లు, సీసీ రోడ్ల పనులకు మరో 12,600 కోట్లు ఖర్చు చేయనున్న ప్రభుత్వం.వెనుకబడిన ఉదయగిరి, ఆత్మకూరు, బద్వేల్, కనిగిరి, కావలి, కందుకూరు ప్రాంతాల నుంచి భారీగా ప్రజల సమీకరణ.గ్రామీణ ముఖచిత్రాన్ని మార్చే ఈ బృహత్తర కార్యక్రమానికి మీడియా, ప్రజలు మద్దతు ఇవ్వాలి.మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి విజ్ఞప్తి.

# సీఎం, డిప్యూటీ సీఎంల పర్యటనను చారిత్రాత్మకం చేయాలి: మంత్రి నారాయణ







**- సీఎం, డిప్యూటీ సీఎం పర్యటనకు పక్కా ప్లాన్**
**- జిల్లా కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో మంత్రి నారాయణ రివ్యూ..అధికారులకు దిశానిర్దేశం**
**- మంత్రి నారాయణ ఆధ్వర్యంలో పల్లె పండుగ ఏర్పాట్లపై గ్రాండ్ సమీక్ష**

**నెల్లూరు సెప్టెంబర్ 28 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

నెల్లూరు జిల్లా కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ మరియు వివిధ శాఖల ఉన్నతాధికారులతో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశం ఘనంగా జరిగింది..ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సంయుక్తంగా హాజరవుతున్న ప్రతిష్ఠాత్మక పల్లె పండుగ కార్యక్రమం మరియు జిల్లా పర్యటనను అత్యంత వైభవంగా, ఎలాంటి చిన్నపాటి పొరపాట్లకు కూడా తావివ్వకుండా చారిత్రాత్మకంగా విజయవంతం చేయడమే లక్ష్యంగా ఈ సమావేశంలో ప్రణాళికలు రూపొందించారు.ఈసమావేశంలో లిమంత్రి నారాయణ మాట్లాడుతూ విఐపిలు, నాయకులు లక్షల్లో తరలివచ్చే సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ రాజ్, విద్యుత్ మరియు రవాణా శాఖల అధికారులు వంద శాతం సమన్వయంతో రౌండ్-ది-క్లాక్ పనిచేయాలని ఆదేశించారు. విఐపి భద్రత, స్పష్టమైన ప్రవేశ-నిష్క్రమణ మార్గాలు, పక్కా ట్రాఫిక్ మళ్లింపు ప్లాన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. అలాగే సభకు వచ్చే జనాభా కోసం భారీ షామియానాలు, నిరంతర తాగునీరు, మజ్జిగ పంపిణీ మరియు అత్యవసర వైద్య శిబిరాలను క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచాలని సూచించారు. సీఎం, డిప్యూటీ సీఎం ద్వయం తొలిసారిగా ఈ వేదికపైకి వస్తున్నందున, ప్రతి శాఖాధిపతి స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ ఈ పర్యటనను నెల్లూరు చరిత్రలోనే ఓ ల్యాండ్‌మార్క్ ఈవెంట్‌గా మార్చాలని ఖచ్చితమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

# సందడిగా ప్రారంభమైన కృష్ణ చైతన్య జూనియర్ కళాశాలల బాలికల స్పోర్ట్స్ మీట్ ..







**- 4500 మందికి పైగా విద్యార్థులతో నాలుగు రోజులు పాటు సందడిగా సాగనున్న స్పోర్ట్స్ మీట్.**
**- క్రీడోత్సవాల్లో భాగంగా పర్యావరణ కాలుష్యం పై అవగాహనా కల్పిస్తూ..2000 మంది విద్యార్థినిలతో భారీ ర్యాలీ..**
**- స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరై.. క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడాలను ప్రారంభించిన ..కృష్ణ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఆర్ వి కృష్ణారెడ్డి , ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి .**

**నెల్లూరు సెప్టెంబర్ 28 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో .. కృష్ణ చైతన్య జూనియర్ కళాశాలల బాలికల స్పోర్ట్స్ మీట్ ఘనంగా జరిగింది.

ఇందులో భాగంగా విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఆర్ వి కృష్ణారెడ్డి , ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి . డైరెక్టర్ పర్వతరెడ్డి రాణా ప్రమోద్ రెడ్డి విద్యార్థులు, సిబ్బందితో కలిసి పర్యావరణ కాలుష్య నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ .. కెవిఆర్ పెట్రోల్ బంక్ నుంచి ఏసి స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు.నెల్లూరు ఏసీ స్టేడియం చేరుకున్న అతిథులకు NCC విద్యార్థులు సాదర స్వాగతం పలికి .. గౌరవ వందనం సమర్పించారు.

అనంతరం అతిథులు క్రీడాజ్యోతి వెలిగించి.. గాల్లోకి బెలూన్లు వదిలి క్రీడలను ప్రారంభించారు.

**ఈ సందర్భంగా డాక్టర్ R.V. కృష్ణ రెడ్డి గారు మాట్లాడుతూ..**

కృష్ణ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు.. క్రీడల్లో కూడా ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు.అందులో భాగంగా ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఇంటర్ కళాశాలల స్పోర్ట్స్ మీట్ నిర్వహించి.. విద్యార్థులకు క్రీడల్లో ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు.

గెలుపోటములతో.. సంబంధం లేకుండా.. విద్యార్థులు క్రీడలను స్పోర్టివ్‌గా.. తీసుకోవాలన్నారు.

విద్యార్థులు.. స్పోర్ట్స్ మీట్ ను చక్కగా వినియోగించుకుని .. జిల్లా, రాష్ట్రస్థాయిలో కళాశాలకు పేరు తీసుకురావాలని సూచించారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ..**

కృష్ణ చైతన్య విద్యాసంస్థలు ప్రారంభించి 28 సంవత్సరాలు పూర్తయ్యాయని.. కళాశాలలో విద్యార్థులకు చదువుతోపాటు, క్రీడలు ఇతర కోకరికులం యాక్టివిటీస్ లో ప్రోత్సాహం అందిస్తుండడం అభినందనీయం.ఇంటర్, డిగ్రీ, పీజీ, కళాశాలల్లో పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం ఎంతో సంతోషకరమన్నారు.

కృష్ణ చైతన్య విద్యా సంస్థల విద్యార్థులు..చదువుల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటుతూ.. క్రీడల్లో కూడా మేటిగా రాణిస్తుండడం.. కృష్ణ చైతన్య విద్యాసంస్థలపనితీరుకు నిదర్శనం అన్నారు.క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు పెరిగిపోవడానికిగల కారణంపర్యావరణంపై..

ప్రజలకు అవగాహన లేకపోవడమేనన్నారు . ఈ రోజు కృష్ణ చైతన్య కళాశాలల స్పోర్ట్స్ మీట్ లో భాగంగా 2000 మంది విద్యార్థులతో.. ర్యాలీ నిర్వహించి.. పర్యావరణ కాలుష్యంపై ప్రజలకు అవగాహన కల్పించడం.. అభినందనీయమని తెలిపారు. కృష్ణ చైతన్య విద్యాసంస్థలు భవిష్యత్తులో.. మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని చంద్రశేఖర్ రెడ్డి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కృష్ణ చైతన్య విద్యా సంస్థల డీన్ రామాంజనేయులు రెడ్డి , అకాడమిక్ డీన్ రాంగోపాల్ రెడ్డి , అడ్మిన్ డీన్ పాయసం రమేష్ గారు , కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా | తిరుపతి | చిత్తూరు | వై.ఎస్.ఆర్. కడప

# మంత్రి నారాయణ మాస్ పిక్చర్







**- రోడ్డు పక్కనే టీ-టిఫిన్.. టెంకాయ్ బండి దగ్గర ముచ్చట్లు**
**- కార్ దిగారు.. కలసిపోయారు.. నెల్లూరు ప్రజాక్షేత్రంలో మంత్రి నారాయణ సంచలనం**
**- ఆడంబరం లేదు.. ఆర్భాటం లేదు.. సామాన్యుడిలా పేదల గుండెల్లోకి మంత్రి నారాయణ**
**- టీ కొట్టు వద్ద కబుర్లు.. పేదలతో కలసి టిఫిన్.. నెల్లూరులో పీక్స్ చేరిన నారాయణ మార్క్ అభిమానం**
**- ప్రజల కష్టాలెరిగిన నేత.. 53, 54 డివిజన్లలో మంత్రి నారాయణ పర్యటన సూపర్ గ్రాండ్ సక్సెస్**

**నెల్లూరు సెప్టెంబర్ 28 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

అధికార హోదాను, ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మంత్రి నారాయణ నెల్లూరు నగరంలోని 53, 54వ డివిజన్లలో జరిపిన పర్యటన ఘనంగా సాగింది. నిత్యం ప్రజల మధ్య ఉండే నాయకుడిగా తన మార్కును మరోసారి చాటుకున్న మంత్రి, కార్ దిగి నేరుగా వీధుల్లోకి వచ్చి సామాన్య ప్రజల్లో ఒకడిగా కలిసిపోయారు. ఒక చిన్న టీ కొట్టు వద్ద ఆగి స్థానికులతో కరచాలనం చేస్తూ, సరదాగా ముచ్చటిస్తూ టీ తాగిన తీరు స్థానికులను ఎంతగానో ఆకట్టుకుంది.

అక్కడితో ఆగకుండా, నగర వీధుల్లో కాలినడకన తిరుగుతూ ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఒక సాధారణ టిఫిన్ సెంటర్‌కు వెళ్లి, పేద ప్రజల పక్కనే కూర్చుని ఎంతో ఆప్యాయంగా అల్పాహారం చేశారు. 53వ డివిజన్‌లో టెంకాయలు అమ్ముకునే ఒక మహిళ వద్ద బండి ఆపి,వ్యాపారం ఎలా జరుగుతుందమ్మా? కుటుంబం సౌఖ్యమేనా? అని ఆత్మీయంగా పలకరించి, ఆమె కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు.ఏ చిన్న ఆర్భాటం లేకుండా, ఒక కన్నతండ్రిలా, ఇంటి పెద్దలా ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యలను ఆలకించిన మంత్రి నారాయణ ఉదారతపై నెల్లూరు ప్రజలు తీవ్రంగా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు.. మన మంత్రి నారాయణ అంటూ స్థానికులు జేజేలు పలుకుతున్నారు.

# నెల్లూరు సిటీలో అభివృద్ధి పరవళ్లు







**ఒక్కరోజే రూ.7.59 కోట్ల పనులకు శ్రీకారం**
**రెండు నెలల్లో పనులు పూర్తి చేయాలి : మంత్రి నారాయణ**

**నెల్లూరు, సెప్టెంబరు 28 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

నెల్లూరు నగరంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. నగరంలోని పలు డివిజన్లలో సోమవారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ విస్తృతంగా పర్యటించి రూ.7.59 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, చేశారు. రహదారులు, సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, గ్రీనరీ, పార్కులు, ఫౌంటైన్లతో పాటు క్రీడా సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.52వ డివిజన్ రంగనాయకులపేట పెద్దమసీదు సెంటర్‌లో రూ.39 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు మంత్రి భూమిపూజ చేశారు. 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డి కాలనీలో రూ.1.70 కోట్లతో డివైడర్, సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. నగరంలోని ఎండ్‌టు ఎండ్ రోడ్లన్నింటినీ త్వరలో పూర్తి చేస్తామని, శంకుస్థాపన చేసిన పనులన్నీ రెండు నెలల్లో పూర్తి చేసేలా అధికారులను ఆదేశించినట్లు మంత్రి నారాయణ తెలిపారు.53వ డివిజన్ వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్ కింద రూ.4 కోట్లతో చేపట్టనున్న గ్రీనరీ, బ్యూటిఫికేషన్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతంలో షటిల్ కోర్టు, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా అక్కడికక్కడే అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. గాంధీగిరిజన కాలనీలో రూ.1.50 కోట్లతో నూతన పార్కు పనులను ప్రారంభించారు. ముత్తుకూరుగేట్ సెంటర్‌లో ఆనం వెంకటరెడ్డి విగ్రహం వద్ద ఫౌంటైన్ పనులకు శంకుస్థాపన చేశారు.

జనార్దన్‌రెడ్డి కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గామల్లేశ్వరస్వామి ఆలయానికి మంత్రి నారాయణ రూ.5 లక్షల విరాళం అందజేశారు. అడగకుండానే విరాళం అందించినందుకు మంత్రికి ఆలయ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

అక్టోబరు 2న స్టేడియం పనులకు భూమిపూజ

నెల్లూరు పాలిటెక్నిక్ కళాశాలలో అధునాతన స్టేడియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అక్టోబరు 2న భూమిపూజ చేసి పనులుప్రారంభిస్తామని, మూడు విడతల్లో స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేస్తామని వెల్లడించారు. అనంతరం వీఆర్ కాలేజీలో విద్యార్థులతో మంత్రి ముఖాముఖి నిర్వహించారు.

అభివృద్ధికి రూ.240 కోట్లు

నెల్లూరు నగర అభివృద్ధికి

మంత్రి నారాయణ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. కార్పొరేషన్ అభివృద్ధికి రూ.240 కోట్లు మంజూరు చేయించారని, నగరాన్ని గ్రీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. నగరంలో తొలి స్టేడియం ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఇలాంటి అభివృద్ధిని గతంలో చూడలేదని పేర్కొన్నారు.డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో మంత్రి ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు మంత్రి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. పేదల అభ్యున్నతితో పాటు పేద పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారని చెప్పారు. అభివృద్ధి ద్వారా తనపై నమ్మకంతో అత్యధిక మెజారిటీ ఇచ్చిన నగరవాసుల రుణం తీర్చుకోవాలని మంత్రి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో మేయర్ దేవరకొండ సుజాత, ప్రిన్సిపాల్ రామారావు, అదనపు కమిషనర్ హిమబిందు, కార్పొరేషన్ ఎస్ఈ జానీ, ఈఈ చంద్రయ్య, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతారెడ్డి, ఆయా డివిజన్ల టీడీపీ నాయకులు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

# నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్,28:**

గూడూరు మున్సిపాలిటీ కాన్ఫరెన్స్ హాల్‌లో 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అక్షరాంధ్ర వాలంటీర్ టీచర్లు, వెల్ఫేర్ సెక్రటరీలకు ఉల్లాస్ అక్షరాంధ్ర శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ట్రైనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధిలో ఏర్పాటు చేయనున్న అక్షరాంధ్ర కేంద్రాల్లో 15 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల వారు లెర్నర్స్‌గా తరగతులకు హాజరుకావచ్చన్నారు. మెప్మా ఆర్పీలు, యాక్టివ్ మెంబర్లు తదితరులు టీచర్లుగా వ్యవహరిస్తూ లెర్నర్స్‌కు వాచక పుస్తకాల ద్వారా పదాలు, వాక్యాలు చదవడం, రాయడం నేర్పించాలని సూచించారు. ప్రతిరోజూ సాయంత్రం కనీసం రెండు గంటల పాటు తరగతులు నిర్వహించాలని తెలిపారు.మెప్మా సీఎం ఎం. కాంతయ్య మాట్లాడుతూ గూడూరు మున్సిపాలిటీ పరిధిలో 4,500 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా అక్షరాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అక్షరాస్యతతో పాటు ఆర్థిక అక్షరాస్యతపై కూడా లెర్నర్స్‌కు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకు లావాదేవీల నిర్వహణ, ఫోన్‌పే, పేటీఎం, గూగుల్‌పే వంటి డిజిటల్ చెల్లింపుల వినియోగంతో పాటు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 2026 నుంచి మార్చి 2027 వరకు తరగతులు నిర్వహించి మొత్తం 100 గంటల శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 2027లో ప్రీ-ఫైనల్ పరీక్ష, మార్చి 2027లో తుది పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సోమశేఖర్, మంజుల, సీఓలు పావని, చందన, డీఈఓ, ఆర్పీలు, వెల్ఫేర్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

# వేలవేడుముచ్చివోలు రహదారిలో ప్రమాదకర మలుపుకు మోక్షం!

**తక్షణ భద్రతా చర్యలకు ఆర్అండ్‌బీ అధికారుల పరిశీలన**
**శాశ్వత పరిష్కారానికి అలైన్‌మెంట్ మార్పు, రహదారి విస్తరణపై ప్రతిపాదనలు**
**జనసేన నాయకుడు దండి నరేంద్ర చొరవ**

**శ్రీకాళహస్తి రూరల్, పెన్ పవర్, సెప్టెంబర్ 28:**

వేలవేడుముచ్చివోలు రహదారిలో తరచూ ప్రమాదాలకు కారణమవుతున్న సుమారు 200 మీటర్ల ప్రమాదకర ఘాట్ మలుపు సమస్య పరిష్కారం దిశగా కీలక అడుగు పడింది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆర్అండ్‌బీ అధికారులు ప్రమాదకర ప్రాంతాన్ని సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సమస్యపై గత వారం ఆర్అండ్‌బీ డీఈ శ్రీ రాంబాబుతో జనసేన నాయకులు చర్చించిన నేపథ్యంలో, డీఈ తన సిబ్బందితో కలిసి ప్రమాదకర మలుపును స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, వాహనదారులు మలుపు వద్ద తరచూ జరుగుతున్న ప్రమాదాలు, తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.తక్షణ భద్రతా చర్యలకు ప్రతిపాదనలుప్రమాదాలను తక్షణమే నియంత్రించేందుకు మలుపుకు ఇరువైపులా సుమారు 75 మీటర్ల ముందే ఐదు వరుసల థిక్ స్టడ్స్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అలాగే ప్రమాదకర మలుపులు, కోణాల వద్ద సుమారు80 మీటర్ల మేర హార్డ్ క్రాష్ బ్యారియర్స్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ రక్షణ చర్యల ద్వారా వాహనాలు అదుపుతప్పి రహదారి పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లకుండా నిరోధించే అవకాశం ఉంటుంది.శాశ్వత పరిష్కారంపై దృష్టి

మలుపు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రహదారి విస్తరణతో పాటు అలైన్‌మెంట్‌ను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని అధికారులు గుర్తించారు. ఇందుకు అవసరమైన భూసేకరణ, రహదారి విస్తరణ, నిర్మాణ పనులు, రోడ్ మార్కింగ్స్, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులు కొలతలు తీసుకున్నారు.

అవసరమైన ఖర్చు అంచనాలను సిద్ధం చేసి సంబంధిత అధికారుల అనుమతుల కోసం ప్రతిపాదనలు సమర్పించనున్నట్లు తెలిపారు.

ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యం: దండి నరేంద్రప్రజల సమస్యను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ భద్రతా చర్యలకుముందుకురావడం అభినందనీయమని జనసేన నాయకుడు దండి నరేంద్ర అన్నారు. సమస్య పరిష్కారానికి స్పందించిన ఆర్అండ్‌బీ డీఈ శ్రీ రాంబాబుకు, ప్రస్తుతం డబుల్ రోడ్డు పనులు చేపడుతున్న శ్రీ మునిరాజారెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు."ప్రజా సమస్యను గుర్తించడం మాత్రమే కాదు.. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం దిశగా అడుగులు వేయించడమే



మా లక్ష్యం. ప్రజల ప్రాణ భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి" అని దండి నరేంద్ర పేర్కొన్నారు.

ఈ స్పాట్ విజిట్‌లో పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొని తమ అనుభవాలను అధికారులకు వివరించారు. ప్రమాదకర మలుపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావాన్ని స్థానికులు వ్యక్తం చేశారు.

# భగత్ సింగ్ స్ఫూర్తి యువతకు ఆదర్శం.

**- సీపీఐ పట్టణ కన్వీనర్ యాదాల సునీల్**




**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్,28:**
భగత్ సింగ్ స్ఫూర్తి యువత కు ఆదర్శం అని, ఆయన ఆశయాలు కొనసాగించాలని సీపీఐ పట్టణ కన్వీనర్ యాదాల సునీల్ పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో 119 వ భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ ఉరికంబాన్ని కూడా లెక్క చేయకుండా దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడు అని కొనియాడారు.
భారతమాతకు దాస్య విముక్తి కలిగించే పోరాటంలో తెల్ల వాడి గుండెలను చీల్చి చెండాడిన వీరుడని కొనియాడారు. యువత నేడు మత్తు పదార్థాలకు బానిస కాకుండా సమాజం లోని సమస్యల పట్ల పోరాడాలన్నారు. దానికి నిదర్శనం దేశంలో నీట్ పేపర్ లీకేజీ పై జరిగిన ఉద్యమమే నిదర్శనం అన్నారు. యువత భగత్ సింగ్ ను స్ఫూర్తి గా తీసుకోవాలన్నారు.
ఈ కార్యక్రమంలోబిల్డింగ్ వర్కర్ జిల్లా అధ్యక్షులు మీరా, మున్సిపల్ నాయకులు గోపి,విద్యార్థి నాయకులు ఇర్ఫాన్, మనోజ్, సంపూర్ణమ్మ, సాహిబ్, తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలి.. రూ.26 వేల వేతనం చెల్లించాలి

**న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం**
**సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య**




**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 28:**
గ్రామ రెవెన్యూ పాలనలో కీలకంగా పనిచేస్తూ ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య డిమాండ్ చేశారు. వీఆర్ఏలను రెగ్యులర్ చేయడంతో పాటు సమాన పనికి సమాన వేతనం కింద నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని కోరారు.
తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన వీఆర్ఏలు సోమవారం శ్రీకాళహస్తిలో సహాయ నిరాకరణ ర్యాలీ నిర్వహించారు. రామసేతు వంతెన నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.
ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వీఆర్ఏలకు సంఘీభావం తెలిపిన పుల్లయ్య మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు రెవెన్యూ సేవలు అందించడంలో వీఆర్ఏలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో వీఆర్ఏలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.
సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సమాన పనికి సమాన వేతనం సూత్రాన్ని అమలు చేసి రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని కోరారు. వీఆర్ఏల కుటుంబాలకు భద్రత కల్పించేలా వయస్సుతో సంబంధం లేకుండా కారుణ్య నియామకాలు చేపట్టాలని సూచించారు. నామినీ వీఆర్ఏలను సైతం వీఆర్వోలుగా గుర్తించి వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.
వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని పుల్లయ్య హెచ్చరించారు. అనంతరం వీఆర్ఏల ప్రతినిధులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డికి అందజేశారు.
ఈ కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం నాయకులు శివ, బాలగురవయ్య, దుర్గా, భవాని, రమణయ్య, హరి, మస్తానమ్మ, వెంకటేష్, టి.గురవయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం



**కార్యకర్తలకు అండగా ఉంటాం.. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తాం**
**పాతతరం నాయకులను కలుపుకొని ముందుకు సాగుతాం: మిద్దెల హరి, సత్రవాడ ప్రవీణ్**

**శ్రీకాళహస్తి,పెన్ పవర్, సెప్టెంబర్ 28:**
బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం అందించాలనే లక్ష్యంతో జనసేన పార్టీ ముందుకు సాగుతోందని, పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని జనసేన పార్టీ నియోజకవర్గ నేత మిద్దెల హరి పేర్కొన్నారు. సోమవారం సత్రవాడ ప్రవీణ్‌తో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.
**ఈ సందర్భంగా మిద్దెల హరి మాట్లాడుతూ..**
జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలు నచ్చి తాము స్వచ్ఛందంగా పార్టీలో చేరినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన సత్తాను చాటేందుకు సమష్టిగా పనిచేస్తామని అన్నారు.
పార్టీ ఆవిర్భావం నుంచి జనసేన కోసం పనిచేస్తున్న సీనియర్ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ, కూటమి నేతల సహకారంతో పార్టీని మరింత పటిష్టం చేస్తామని తెలిపారు. కార్యకర్తలే పార్టీకి బలమని, తమ వెంట నడిచే కార్యకర్తలను ఎవరైనా ఇబ్బందులకు గురిచేయాలని చూస్తే తాము చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.
త్వరలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ శ్రీకాళహస్తిలో నిర్వహించనున్న బహిరంగ సభకు ప్రజలు, జనసేన శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆ సభ సందర్భంగా ఇతర పార్టీల నుంచి పెద్దఎత్తున చేరికలు ఉండే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రశ్నించే తత్వం, అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారం అందించడమే లక్ష్యంగా పవన్ కళ్యాణ్ చూపుతున్న మార్గంలో ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.
**జనసేన సైనికుడిగా పనిచేస్తా: సత్రవాడ ప్రవీణ్**
మాజీ ఎమ్మెల్యే ముని రమణయ్య కుమారుడు సత్రవాడ ప్రవీణ్ మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి పవన్ కళ్యాణ్ సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడై జనసేన పార్టీలో చేరినట్లు తెలిపారు. యువకుడిగా, జనసేన సైనికుడిగా పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.
అంతకుముందు మిద్దెల హరి, సత్రవాడ ప్రవీణ్ శ్రీకాళహస్తీశ్వర స్వామి, జ్ఞానప్రసూనాంబిక అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం నగిరి వీధిలోని మిద్దెల హరి యువసేన కార్యాలయం వద్ద అభిమానులు, జనసేన కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకుని బాణాసంచా కాల్చి ఘన స్వాగతం పలికారు.
ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జయదేవన్ గిరి, తిరుపతి పార్లమెంటు జనసేన పార్టీ పరిశీలకులు తమ్మినేని వెంకటేశ్వర్లు, కె.వి. రమణ, గంజి వెంకటేష్, బండి రమేష్, ఈగ హరి, కరుణాకర్, పాలసెట్టి నరసింహులు, బొజ్జ ప్రభాకర్, ధావాల గిరి, చల్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇరుగళేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నూతన చారిటబుల్ ట్రస్ట్‌చైర్మన్‌గా రావిళ్ల మునిరత్నం నాయుడు ఏకగ్రీవ ఎన్నిక.. సభ్యుల ప్రమాణ స్వీకారం



**ఏర్పేడు, పెన్ పవర్ ,సెప్టెంబర్ 28:**
రావిళ్లవారికండ్రిగ గ్రామంలో వెలసియున్న శ్రీ ఇరుగళేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణం కోసం నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ ఇరుగళేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పునర్నిర్మాణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్‌గా శ్రీ రావిళ్ల మునిరత్నం నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఎన్నికైన ట్రస్ట్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణ కార్యక్రమాలతో పాటు స్వామివారి ఆలయంలో వైభవంగా నిర్వహించే నవరాత్రి బ్రహ్మోత్సవాలు, కార్తీక మాస బ్రహ్మోత్సవాలు, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, ట్రస్ట్ నిధులతో నిర్వహించనున్నట్లు సభ్యులు తెలిపారు.ముఖ్యంగా ఆలయానికి సంబంధించిన నిధులను ఎటువంటి సందర్భంలోనూ వినియోగించకుండా, ట్రస్ట్‌కు సమకూరే నిధులతోనే అభివృద్ధి కార్యక్రమాలు, ఉత్సవాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని ట్రస్ట్ సభ్యులు స్పష్టం చేశారు. భక్తుల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడమే ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.శ్రీ ఇరుగళేశ్వరస్వామివారి ఆలయ అభివృద్ధికి భక్తులు, దాతలు, ప్రజలు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ట్రస్ట్ చైర్మన్ రావిళ్ల మునిరత్నం నాయుడు, సభ్యులు కోరారు. ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో విలువైనదని తెలిపారు.

# అంగన్ వాడీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి







**సీఎస్ఆర్ నిధులతో నూతన భవనాలు, వసతుల కల్పన**
**బోరు సక్సెస్ తో ఎర్రగుంట వాసుల తాగునీటి సమస్యకు పరిష్కారం**
**శ్రీవాణి ట్రస్ట్ నిధులతో దేవస్థానాల నిర్మాణం**
**నెల్లూరు సెప్టెంబర్ 28 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**
వెంకటాచలం మండలం సరస్వతీ నగర్ పంచాయతీ పరిధిలోని ఎర్రగుంటలో పర్యటన సందర్భంగా తెలియజేసిన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, శృతి
ఎర్రగుంటలో పర్యటించి కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించడంతో పాటు ప్రజా సమస్యలపై ఆరా తీసిన యువనేతలు
అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంతో పాటు అక్కడ వసతులపై ఆరా
స్థానికుల తాగునీటి అవసరాల కోసం వేసిన 10 బోర్లు ఫెయిల్ అయిన తర్వాత 11వ బోరు సక్సెస్ అయ్యి నీరు పుష్కలంగా ఉండటంపై ఆనందం వ్యక్తం చేసిన రాజగోపాల్ రెడ్డి, శృతి
ఎర్రగుంట వాసుల కోరిక మేరకు హైవే పక్కనే ఉన్న అంగన్ వాడీ కేంద్రానికి ప్రహరీ నిర్మాణంతో పాటు శ్మశానంలో వసతుల కల్పనకు హామీ
సర్వేపల్లి నియోజకవర్గంలో అంగన్ వాడీ కేంద్రాలపై శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని, ఇప్పటికీ సౌత్ ఇండియా కంపెనీ సహకారంతో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అంగన్ వాడీ కేంద్రాలకు అవసరమైన అన్ని పరికరాలు అందజేసినట్లు వెల్లడిప్రస్తుతం సీఎస్ఆర్ నిధులతో అంగన్ వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించడంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్న సోమిరెడ్డి
గుడులు, భజన మందిరాలు కట్టుకుంటామంటే శ్రీవాణి ట్రస్టు నిధులు మంజూరు చేయిస్తున్నామని తెలియజేసిన రాజగోపాల్ రెడ్డి, శృతి

# అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలు ఘనంగా నిర్వహణ

## పౌష్టికాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించిన సిబ్బంది

**శ్రీకాళహస్తి,పెన్ పవర్,సెప్టెంబర్ 28:**
పోషణ మాసోత్సవాలు2026లో భాగంగా శ్రీకాళహస్తి పరిధిలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, సంబంధిత సిబ్బంది చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించారు.
పిల్లల సంపూర్ణ ఎదుగుదలకు సమతుల్య ఆహారం ఎంతో అవసరమని, గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సిబ్బంది సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు తదితరాలను ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా పోషకాహార లోపాన్ని నివారించవచ్చని తెలిపారు.
అలాగే చిన్నారుల ఎదుగుదలను ఎప్పటికప్పుడు



పరిశీలిస్తూ బరువు, ఎత్తు తదితర వివరాలను నమోదు చేయడంతో పాటు, పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి అవసరమైన సూచనలు, సేవలు అందించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు.
ఆరోగ్యవంతమైన బాల్యం బలమైన భవిష్యత్తు అనే



లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషణపై అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. పోషణ మాసోత్సవాలను విజయవంతం చేయడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

# కుల వివక్షను ధైర్యంగా ప్రశ్నించిన మహనీయుడు గుర్రం జాషువా

## సామాజిక మార్పుకు తన కవిత్వాన్ని ఆయుధంగా మలిచిన ధన్యజీవి



**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,సెప్టెంబర్ 28:**
సమాజంలో అణగారిన వర్గాలు ఎదుర్కొంటున్న అవమానాలు, కుల వివక్ష, అసమానతలను తన రచనల ద్వారా ధైర్యంగా ప్రశ్నించిన మహనీయుడు గుర్రం జాషువా అని ఎస్.వి.ఏ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ అన్నారు. సోమవారం శ్రీకాళహస్తిలోని ఎస్.వి.ఏ ప్రభుత్వ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ మాట్లాడుతూ.. గుర్రం జాషువా తన కవిత్వాన్ని కేవలం సాహిత్య సృష్టిగా కాకుండా సామాజిక మార్పుకు శక్తివంతమైన సాధనంగా ఉపయోగించారని పేర్కొన్నారు. సమాజంలో నెలకొన్న అసమానతలు, అంటరానితనం, కుల వివక్ష వంటి సామాజిక రుగ్మతలను తన రచనల ద్వారా ప్రశ్నించిన జాషువా చిరస్మరణీయుడని అన్నారు.
సమానత్వం, స్వేచ్ఛ, మానవత్వం, సామాజిక న్యాయం వంటి ఉన్నత విలువలను తన సాహిత్యంలో ప్రతిబింబించిన జాషువా ధన్యజీవి అని కొనియాడారు. కులం, మతం, ఆర్థిక స్థితి ఆధారంగా మనుషుల మధ్య ఎలాంటి వివక్ష ఉండకూడదనే సందేశాన్ని ఆయన రచనలు బలంగా చాటిచెప్పాయని తెలిపారు.
ఈ సందర్భంగా ఇతర వక్తలు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని, సామాజిక హక్కులను తన కవిత్వం ద్వారా వినిపించిన జాషువా తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు. నేటి యువత జాషువా సాహిత్యాన్ని అధ్యయనం చేసి, ఆయన చూపిన మానవతా మార్గాన్ని, సమానత్వ భావనను జీవితంలో ఆచరించాలని సూచించారు.
కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ మన్యం నరసింహులు, డాక్టర్ టి. గంగారామ్, అధ్యాపకులు డాక్టర్ కట్టా సుబ్బారావు, డాక్టర్ కందేరి శ్రీదేవి, డాక్టర్ పి. గాయత్రి, డాక్టర్ జి. హన్న, డాక్టర్ పరంధామయ్య తదితర అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

## ఆత్మహత్యలు, ఇంటి నుంచి వెళ్లిపోవడంపై న్యాయ అవగాహన

**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,సెప్టెంబర్ 28:**
విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన పెంపొందించుకొని, జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని సీనియర్ న్యాయవాదులు సూచించారు. శ్రీకాళహస్తిలోని జిల్లా ప్రజా పరిషత్ ఆర్‌పీబీఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు.
ఈ సందర్భంగా విద్యార్థుల్లో పెరుగుతున్న మనోవేదన, ఒత్తిడి, ఆత్మహత్య ఆలోచనలు, ఇంటి నుంచి వెళ్లిపోవడం వంటి అంశాలపై న్యాయవాదులు అవగాహన కల్పించారు. సమస్యలు ఎదురైనప్పుడు ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ఆత్మహత్యకు ప్రేరేపించడం వంటి చర్యలకు చట్టపరమైన పరిణామాలు ఉంటాయని వివరించారు.
అదేవిధంగా విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చెడు నిర్ణయాలకు దూరంగా ఉండాలని, విద్యపై పూర్తి దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని న్యాయవాదులు సూచించారు. క్రమశిక్షణ, నైతిక విలువలు, చట్టంపై అవగాహనతో ముందుకు సాగి భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గుమ్మల రాజేశ్వరరావు, మల్లికార్జునయ్య, పారా లీగల్ వాలంటీర్ బాబా ఫరీద్, కోర్టు సిబ్బంది శంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులకు



న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు, వారి భవిష్యత్తు పట్ల బాధ్యతగా వ్యవహరించేలా సదస్సు ద్వారా చైతన్యం కల్పించారు.

# నంద్యాలలో ప్రపంచ రాబిస్ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ




**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 28**
ప్రపంచ రేబీస్ దినోత్సవం సందర్భంగా నంద్యాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శారద బాయి, జిల్లా సర్వేలెన్స్ అధికారి డాక్టర్ ఎస్. అశ్రుఫ్ ఆలీ రేబీస్ దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రేబీస్ నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కుక్కలు, ఇతర జంతువులు కరిచిన వెంటనే గాయాన్ని సబ్బు, నీటితో శుభ్రంగా కడిగి, ఆలస్యం చేయకుండా ప్రభుత్వ వైద్యసంస్థను సంప్రదించి యాంటీ రేబీస్ టీకా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రసన్న లక్ష్మీ, డీపీఎంవో డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శ్రీజ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటు హక్కును కాపాడాలి.. సి ఈ సి జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలి

## ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ ఆందోళన.. విజయవాడలో ఎలక్షన్ కమిషన్ కార్యాలయం వద్ద నిరసన







**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,సెప్టెంబర్ 28:**
ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి రాజ్యాంగబద్ధంగా లభించిన ఓటు హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని, అయితే ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపించారు. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయవాడలోని ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని, అరెస్టు చేసి విచారణ జరపాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఇటువంటి డిమాండ్లతో విజయవాడలో కాంగ్రెస్ నిరసన నిర్వహించినట్లు తాజా వార్తా కథనాలు కూడా వెల్లడించాయి.
ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధంగా నిర్వహించాల్సిన ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా అత్యంత కీలకమని అన్నారు.ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పేరుతో దేశవ్యాప్తంగా లక్షలాది ఓట్లు తొలగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి, ఓటర్ల హక్కుల పరిరక్షణకు ఎన్నికల సంఘం స్పష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.
శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ.. బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ పార్టీకి ప్రజల మద్దతు లభిస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లను లక్ష్యంగా చేసుకుని ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ద్వారా ఓట్ల తొలగింపునకు ప్రయత్నిస్తున్నారంటూ ఆరోపించారు. ప్రజల ప్రాథమిక హక్కుగా ఉన్న ఓటు హక్కును తొలగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.
ఎన్నికల ప్రక్రియపై స్వతంత్ర విచారణ జరపాలి, ఓటర్ల జాబితాలో జరిగినట్లు ఆరోపిస్తున్న మార్పులపై సమగ్రంగా పరిశీలన చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు.ఎస్ ఐ ఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త కిరణ్, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త నరసయ్య, కార్యదర్శులు ఇళయరాజా, గోపి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనుగౌడ్, జిల్లా పరిపాలన కమిటీ చైర్మన్ రత్నం, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు హరికృష్ణ, స్పోర్ట్స్ సెల్ చైర్మన్ బాబు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వినోద్, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, నాగలాపురం మండల అధ్యక్షులు షణ్ముగం, సూళ్లూరుపేట నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు శ్వేత, దొరవారిసత్రం మండల మహిళా అధ్యక్షురాలు చాముండేశ్వరి, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ యూత్ యాక్టివిటీస్‌లో 'ది స్కూల్' విద్యార్థుల సత్తా

**డ్యాన్స్, రంగోలి, ఉపన్యాసం, చిత్రలేఖన పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు.. చెకుముకి సైన్స్ సంబరాల్లోనూ ప్రతిభ**

**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,సెప్టెంబర్ 28:**
రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే యూత్ యాక్టివిటీస్ పోటీల్లో 'ది స్కూల్' విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు.
సీనియర్స్ డ్యాన్స్ విభాగంలో పదో తరగతి విద్యార్థిని జె. హర్షితా భాయ్ ప్రథమ స్థానం సాధించగా, తొమ్మిదో తరగతి విద్యార్థిని బి. గౌతమీ సుధ ద్వితీయ స్థానాన్ని సాధించారు. జూనియర్స్ డ్యాన్స్ విభాగంలో ఆరో తరగతి విద్యార్థిని ఎం. జయశ్రీ ప్రథమ స్థానంలో నిలిచారు. రంగోలి పోటీలో తొమ్మిదో తరగతి విద్యార్థిని పూజ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది.
ఉపన్యాస పోటీల్లో సీనియర్స్ విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థినులు బి. గౌతమీ సుధ, ఎస్. రేషిత ప్రథమ స్థానాన్ని సాధించగా, పదో తరగతి విద్యార్థి కె. కేతన్ ద్వితీయ స్థానంలో నిలిచారు. జూనియర్స్ విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థిని బి. శ్రీవర్షిత ప్రథమ స్థానాన్ని సాధించారు. చిత్రలేఖన పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థినులు కె. లిఖిత, ఎ. లిఖితారెడ్డి వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు.



అలాగే తిరుపతిలో ఆదివారం జిల్లా స్థాయిలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాల పోటీల్లో కూడా ది స్కూల్ విద్యార్థులు టి. లాస్య ప్రియ, టి.ఆర్. ముఖేష్, ఎస్.కె. ఖలీద్ పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.
ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ జనార్ధన్ రావు జె. పవార్ మాట్లాడుతూ.. విద్యతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, కళా నైపుణ్యాలు, వక్తృత్వ ప్రతిభను వెలికితీసేలా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. వివిధ పోటీల్లో పాల్గొని విజయం సాధించడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు మరింత పెంపొందుతాయని పేర్కొన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా సన్మానించి అభినందించింది. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. విశాల, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం

## జనసేన నాయకులు పేట బ్రదర్స్ మిత్రబృందం ఘన నివాళులు







**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 28:**
భారత స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు భగత్‌సింగ్ జయంతి సందర్భంగా జనసేన పార్టీ నాయకులు పేట బ్రదర్స్ మిత్రబృందం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన భగత్‌సింగ్ త్యాగాలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు.
**ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..**
"విప్లవం వర్ధిల్లాలి" అనే నినాదంతో యువతలో చైతన్యం నింపుతూ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా భగత్‌సింగ్ సాగించిన పోరాటం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యం, దేశం పట్ల అంకితభావం, సమాజంలో మార్పు తీసుకురావాలనే సంకల్పం ప్రతి ఒక్కరిలో ఉండాలని ఆయన ఆశయాలు చాటిచెబుతున్నాయని తెలిపారు.
దేశం కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన భగత్‌సింగ్ యువతకు నిత్య స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి, సమాజ శ్రేయస్సుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.
ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, ప్రదీప్‌కుమార్, ఆరిఫ్, మనీ, నవీన్, దివాకర్, చందు తదితరులు పాల్గొన్నారు. వీర మహిళలు, శ్రీకాళహస్తి టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కవిత, పేట శారద, నారాయణ గాయత్రి తదితరులు పాల్గొని భగత్‌సింగ్‌కు ఘన నివాళు లర్పించారు.

## పల్లె ప్రగతికి ఎన్డీయే కూటమి బాటలు

**గ్రామీణాభివృద్ధికి భారీగా నిధులు.. రహదారులు, పాడి పరిశ్రమ, ఉద్యానవనాలకు ప్రాధాన్యం**
**టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు**

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 28:**
గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణాభివృద్ధిని తిరిగి గాడిలో పెట్టేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందని తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.

**రూ.11,085 కోట్లతో అభివృద్ధి పనులు**
నెల్లూరు జిల్లా ఉదయగిరిలో నిర్వహించనున్న 'పల్లె పండుగ3.0' కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని వేలాది గ్రామ పంచాయతీల్లో సుమారు రూ.11,085 కోట్ల విలువైన అభివృద్ధి పనులను వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నట్లు ఉమేష్ రావు తెలిపారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటాగా రూ.5,391 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.5,694 కోట్లు వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు.
వీబీజీ రామ్ జీ పథకం కింద రూ.1,750 కోట్లు, గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కింద రూ.3,800 కోట్లు, నాబార్డ్, సాస్కీ తదితర నిధుల ద్వారా మరో రూ.2,000 కోట్లతో గ్రామీణాభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

**గ్రామీణ రహదారులకు పునరుజ్జీవనం**
గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఉమేష్ రావు అన్నారు. సుమారు రూ.2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, రూ.7,550 కోట్లతో 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

**పాడి రైతులకు అండగా 'మినీ గోకులాలు'**
గ్రామీణ ప్రజల ఆర్థికాభివృద్ధికి పాడి పరిశ్రమ కీలకమని



పేర్కొంటూ, రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.300 కోట్ల వ్యయంతో 22,000 మినీ గోకులాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. తద్వారా పాడి రైతులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు.

**ఉద్యానవనాలకు ప్రోత్సాహం**
ఉద్యానవన రంగానికి కూడా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఉమేష్ రావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.225 కోట్లతో 50 వేల ఎకరాల్లో తోటల పెంపకానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే 1,000 కిలోమీటర్ల మేర మేజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి రూ.110 కోట్లు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు.

**గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన**
గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు సుమారు రూ.200 కోట్లతో పంచాయతీ భవనాలు, రచ్చబండలు, బస్ షెల్టర్లు తదితర నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.
గ్రామీణాభివృద్ధి, రహదారుల నిర్మాణం, పాడి పరిశ్రమ, ఉద్యానవనాలు, మౌలిక వసతులపై సమగ్ర దృష్టితో ఎన్డీయే ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉమేష్ రావు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో తంగేళ్లపాలెం పీఏసీఎస్ చైర్మన్ బీమాల భాస్కర్, శ్రీకాళహస్తి పట్టణ సహకార బ్యాంకు మాజీ చైర్మన్ డి.వి.నారాయణ, తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు మణి, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, తిరుపతి పార్లమెంటు నాయకులు పూల శేఖర్, పసుపులేటి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## బుచ్చిలో మొదలైన అభివృద్ధి పనుల జాతర

## రు.3 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం



**బుచ్చిరెడ్డిపాలెం, పెన్ పవర్ సెప్టెంబర్ 28.**
మునిసిపాలిటీ పరిధిలోని 6,7,8,9,10 వార్డులలో 3 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు( రోడ్లు, డ్రైనేజీలు) సోమవారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన మున్సిపల్ కార్యాలయ భవనం ప్రారంభోత్సవ సమయంలో మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ ప్రకటించిన 45 కోట్ల రూపాయల నిధులలో ప్రస్తుతం 22 కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు ఆ మొత్తంతో మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో అవసరమైన మేరకు రోడ్లు డ్రైనేజీల వ్యవస్థను అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకు వెళుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాలెం అభివృద్ధికి వస్తున్న నిధులు ప్రభుత్వం నుంచి వచ్చేయే కానీ విపిఆర్ ట్రస్ట్ నుంచి కాదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పట్టణ అభివృద్ధి పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని విమర్శించిన ఎమ్మెల్యే ప్రస్తుతం అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. రాబోయే మూడు సంవత్సరాల కాలంలో బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలో మరిన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజలు తమ సమస్యలపై ప్రశ్నించే హక్కును వినియోగించుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ సమస్యలను పరిష్కరించకపోతే నేరుగా తన కార్యాలయానికి వచ్చి సమస్యలను తెలుపుకోవాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలు ఇదే వేగంతో కొనసాగాలంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీలోని 28 వార్డులతోపాటు చైర్మన్ స్థానాన్ని కూడా కూటమి అభ్యర్థులు గెలుచు కోవాలని ప్రజలను కోరారు.



మొత్తం మీద బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు రాజకీయ వేడి కూడా పెరుగుతుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి, వైస్ చైర్మన్ లు యరటపల్లి శివకుమార్ రెడ్డి, పఠాన్ నస్రిన్, మున్సిపల్ కమీషనర్ ఇనమల చిన్నబాబు, పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, రూరల్ అధ్యక్షులు బెజవాడ జగదీష్, టిడిపి నాయకులు యర్రం రెడ్డి గోవర్ధన్ రెడ్డి, మోర్ల మురళి, వింజం రామానాయుడు, తెలనాకుల ఆదినారాయణ, మున్సిపల్ కౌన్సిలర్లు, టిడిపి పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరి షేక్ సుభహాని, స్థానిక టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రబీకి 450 క్వింటాళ్ల పప్పు శనగ విత్తనాలు మంజూరు.



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 28**
నంద్యాల మండలం లో రబీ 2026 సంవత్సరానికి గాను 450 క్వింటాళ్ల పప్పు శనగ విత్తనాలు మంజూరు అయినవనీ నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల మండలంలో రబీ కాలంలో పలు గ్రామాల్లో పప్పు శనగ సాగు చేస్తారని, మండలంలో 477 హెక్టార్ల సాధారణ విస్తీర్ణం ఉన్నదని , ఇందుకు గాను ప్రభుత్వం 35% రాయితీ పై శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పప్పు శనగ పూర్తి ధర: 9000/- క్వింటాలుకు, రాయితీ: 3150/- క్వింటాలుకు, రైతు వాటా: 5850/- క్వింటాలుకు. ప్రతి రైతుకు వారి విస్తీర్ణంకు అనుగుణంగా ఒక బస్తా నుండి గరిష్టంగా 10 బస్తాలు అనగా 5 ఎకరాల వరకు ఇవ్వబడినని, కావున రైతులు వారి రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## శ్రీకాళహస్తి విద్యార్థులు సిలంబంలో సత్తా చాటారు

**రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్‌లో రెండు బంగారు.. ఒక రజత పతకం కైవసం**

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 28:**
నెల్లూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి సిలంబం ఛాంపియన్‌షిప్2026లో శ్రీకాళహస్తికి చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి మూడు పతకాలు సాధించారు. సిలంబం అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 27న నెల్లూరు సోమిశెట్టి కళ్యాణ మండపంలో ఈ పోటీలు నిర్వహించారు.
శ్రీకాళహస్తి నుంచి పాల్గొన్న జోషిత్, లితిక, క్లారిసీ తమ ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు సాధించారు. అండర్14, 50 కేజీల విభాగంలో జోషిత్ బంగారు పతకం, అండర్14, 60 కేజీల విభాగంలో లితిక బంగారు పతకం సాధించారు. అలాగే అండర్14, 40 కేజీల విభాగంలో క్లారిసీ రజత పతకం కైవసం చేసుకుని సత్తా చాటారు.ఈ విజయంతో శ్రీకాళహస్తి యువ క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో తమ ప్రతిభను చాటడంతో పాటు పట్టణానికి మంచి పేరు తీసుకువచ్చారు. చిన్న వయసులోనే సిలంబం వంటి సంప్రదాయ క్రీడలో ప్రతిభ కనబరచడం పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. విజేతలను వారి తల్లిదండ్రులు, కోచ్‌లు, నిర్వాహకులు అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ ఛాంపియన్‌షిప్‌కు సిలంబం అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు కె. తనిగివేలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సెక్రటరీ డాక్టర్ రవఅంప్రు ధనుష్తో పాటు పలువురు క్రీడా ప్రముఖులు, నిర్వాహకుల సమక్షంలో పోటీలు



ఉత్సాహభరితంగా జరిగాయి.రాష్ట్రస్థాయిలో మూడు పతకాలు సాధించిన శ్రీకాళహస్తి విద్యార్థులు సిలంబం క్రీడలో తమకు ఉజ్వల భవిష్యత్తు ఉందని నిరూపించారు. రానున్న రోజుల్లో జాతీయస్థాయి పోటీల్లోనూ రాణించి మరిన్ని పతకాలు సాధించాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

## భగత్ సింగ్ స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం

## ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు ఐక్యంగా ఉద్యమించాలి: డీవైఎఫ్ఐ

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 28:**
విప్లవ వీరుడు భగత్ సింగ్ చూపిన తెగువ, త్యాగ స్ఫూర్తితో దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి రవి పిలుపునిచ్చారు. సోమవారం శ్రీకాళహస్తిలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో భగత్ సింగ్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.



ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం రవి మాట్లాడుతూ దేశ సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు అత్యంత కీలకమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఓటు హక్కు పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ప్రత్యేకంగా యువత, జెన్-జీ తరానికి చెందిన యువ ఓటర్ల ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటు హక్కుకు సంబంధించిన అంశాలపై బీజేపీ ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై పలు ఆరోపణలు చేశారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని మరింత బలోపేతం చేయాలంటే అర్హత కలిగిన వయోజనులందరికీ ఓటు హక్కు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాస్వామ్య హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు.
ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, పెనగడం గురవయ్య, వెలివేంద్రం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 52 వార్డులకు 217 తుది పోలింగ్ కేంద్రాలు, పోస్టర్ విడుదల చేసిన కమిషనర్ బి. శేషన్న




**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 28:**
నంద్యాల పురపాలక సంఘం పరిధిలోని 52 వార్డులకు సంబంధించి 217 తుది పోలింగ్ కేంద్రాల జాబితాను మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పోస్టర్ రూపంలో విడుదల చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు జాబితాను ప్రజల పరిశీలనార్థం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.
పోలింగ్ కేంద్రాల వివరాలు మున్సిపల్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం, జిల్లా కోర్టు, మున్సిపల్ మేజిస్ట్రేట్ కోర్టు, ప్రధాన తపాలా కార్యాలయం, రైల్వే స్టేషన్ ఉప తపాలా కార్యాలయం, పోలీస్ కార్యాలయం, పబ్లిక్ గ్రంథాలయాలు, లీడ్ బ్యాంక్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించినట్లు కమిషనర్ తెలిపారు.

# గోరుకల్లు రిజర్వాయర్ సమస్యలపై అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న వైఎస్ఆర్సిపి నాయకులు

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 28**
నంద్యాల జిల్లా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) లో జాయింట్ కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీ కి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మరియు ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మర్యాదపూర్వకంగా కలిసి గోరుకల్లు రిజర్వాయర్ సమస్యలపై అధికారులకు వినతి పత్రం అందజేసి, క్రింది డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు
సమగ్ర విచారణ: గోరుకల్లు రిజర్వాయర్ గేట్ల నిర్వహణ లోపం మరియు అకస్మాత్తుగా నీటి విడుదల జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యానికి కారణమైన బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.
నష్టపరిహారం: వరద/నీటి విడుదల కారణంగా పంట



నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం వెంటనే పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందించాలి. మౌలిక వసతుల పునరుద్ధరణ: గ్రామాల్లో తీవ్రంగా దెబ్బతిన్న రోడ్లు, ఇతర మౌలిక వసతుల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టి ప్రజలకు రవాణా సౌకర్యాన్ని పునరుద్ధరించాలి.

# కాణిపాకం వేడుకలకు మహానంది పట్టు వస్త్రాలు



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 28**
కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీ కామేశ్వరీ మహానందీశ్వర స్వామివారి తరఫున సోమవారం పట్టువస్త్రాలను శాస్త్రోక్తంగా సమర్పించారు. మహానంది దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్. శ్రీనివాసరెడ్డి, చైర్మన్ నరాల చంద్రమౌళిరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు, ఏఈఓలు, సూపరింటెండెంట్లు, ధర్మకర్తలు కాణిపాకం చేరుకుని స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు.
ఈ సందర్భంగా కాణిపాకం దేవస్థానం తరఫున మహానందీశ్వర స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలను ఎన్. శ్రీనివాసరెడ్డి, నరాల చంద్రమౌళిరెడ్డికి అందజేసి వేదాశీస్సులు అందించారు. అలాగే మహానంది దేవస్థానం తరఫున కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలను స్వీకరించారు. ఇరు ఆలయాల ప్రతినిధులు వేదపండితుల ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమం రెండు ప్రముఖ పుణ్యక్షేత్రాల మధ్య ఆధ్యాత్మిక అనుబంధాన్ని చాటిచెప్పింది.

# ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై పై కమిషనర్ తనిఖీలు

**నంద్యాల ప్రతినిధి పెన్ పవ సెప్టెంబర్ 28**
నంద్యాల పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న సోమవారం పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల నిల్వ, వినియోగాన్ని పరిశీలించి, నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వ్యాపారులు నిబంధనలు పాటించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగంపై మున్సిపల్ అధికారులు నిరంతర తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. తనిఖీల్లో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శానిటేషన్ సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణ, శివప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# దాడి కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు.... ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 28**
గత నెల 8వ తేదీన ఆత్మకూర్ బస్టాండ్ సమీపంలోని త్రివేణి బార్‌లో జరిగిన గొడవకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి వెల్లడించారు. అరెస్ట్ అయిన వారిని ఇమ్రాన్ మరియు ఈశ్వర్‌లుగా గుర్తించారు. నిందితులు ఇద్దరూ సల్మాన్ రాజు అనే వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తు చేపట్టి ఈ రోజు వారిని అరెస్ట్ చేశారు. విచారణలో ఇమ్రాన్‌పై నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీట్ ఉన్నట్లు తేలిందని పోలీస్ అధికారి తెలిపారు.
**పోలీసుల హెచ్చరిక** ,సమాజంలో రౌడీషీటర్లు మరియు ఇతర నేరస్థులు చట్టానికి కట్టుబడి, మర్యాదగా జీవించాలని పోలీసులు స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించే వారిపై నాన్-బెయిలబుల్ ( నాన్- బేల్బుల్ ) కేసులు నమోదు చేయడమే కాకుండా, అవసరమైతే పీడీ యాక్ట్ (పీడీ యాక్ట్ ) ప్రయోగించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

# నూనెపల్లి అండర్‌గ్రౌండ్ బ్రిడ్జికి దీక్షలు

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 28**
నంద్యాల నూనెపల్లి రైల్వే అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ నూనెపల్లి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరవధిక రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి కమిటీ సభ్యులు పూలమాలలు వేసి ఉద్యమాన్ని ప్రారంభించారు.
నూనెపల్లి ప్రాంతంలోని 10 వార్డులకు చెందిన సుమారు 40 వేల మంది, 30 గ్రామాల ప్రజలు రైల్వే ట్రాక్ దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారని, పశువులు, వ్యవసాయ పనిముట్ల రాకపోకలకు కూడా తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయని కమిటీ సభ్యులు తెలిపారు. గత ఎనిమిదేళ్లుగా అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి కోసం ప్రయత్నాలు చేస్తున్నా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదన్నారు.ఎంపీ బైరెడ్డి శబరి, మంత్రి ఎన్ఎండి ఫరూక్ దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు తెలిపారు. రైల్వే శాఖ నిధులతో బ్రిడ్జి నిర్మాణానికి సిద్ధంగా ఉందని, స్థల సేకరణను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించే వరకు దీక్షలు కొనసాగిస్తామని నూనెపల్లి అభివృద్ధి కమిటీ కన్వీనర్ శంకరయ్య, సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి మాజీ కౌన్సిలర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు మద్దతు ప్రకటించారు.



# విద్యార్థుల్లో దేశభక్తి స్ఫూర్తి.. భారత్‌ఏ2047పై అవగాహన సేవా హి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా శ్రీకాళహస్తిలో చిత్రలేఖన, వక్తృత్వ పోటీలు





**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 28:**
విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించే లక్ష్యంతో సేవా హి సంకల్ప్ అభియాన్లో భాగంగా శ్రీకాళహస్తి పట్టణంలోని సరస్వతీబాయి హైస్కూల్‌లో చిత్రలేఖన, వక్తృత్వ పోటీలు ఉత్సాహభరితంగా నిర్వహించారు.
భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17వ తేదీ నుంచి నెల రోజుల పాటు నిర్వహిస్తున్న సేవా హి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ప్రజ్ఞ శ్రీ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. సుమారు 50 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.
“25 కోట్ల చిన్నారుల కలలు భారత్‌ఏ2047 లక్ష్యం” అనే అంశంపై నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులు తమ ఆలోచనలకు రంగులద్దారు. దేశ భవిష్యత్తు, అభివృద్ధి, యువత పాత్ర, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం వంటి అంశాలపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ప్రసంగించి ఆకట్టుకున్నారు.
ఈ సందర్భంగా ప్రజ్ఞ శ్రీ మాట్లాడుతూ.. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికితీయడంతో పాటు 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలనే ఆలోచనను చిన్ననాటి నుంచే పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమన్నారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు.
దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, సృజనాత్మకతతో ముందుకు సాగితే భారతదేశాన్ని మరింత శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దగలమని ఆమె అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక బాధ్యత, దేశం పట్ల నిబద్ధతను పెంచుతాయని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నిర్వాహకుల ఆధ్వర్యంలో బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. విద్యార్థుల ప్రతిభను ఉపాధ్యాయులు, నిర్వాహకులు ప్రశంసించారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కంద్రిగ ఉమా, సీనియర్ నాయకులు గరికపాటి రమేష్ బాబు, మహిళా నాయకురాలు ఉమా సింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యం నారాయణ పాఠశాలలో ఘనంగా స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్





**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,సెప్టెంబర్ 28:**
శ్రీకాళహస్తి పట్టణంలోని నారాయణ పాఠశాలలో ఛాంప్స్ విభాగానికి చెందిన గ్రేడ్1 విద్యార్థుల ఆధ్వర్యంలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ ఎల్ సి) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, చిన్ననాటి నుంచే ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సృజనాత్మకతను పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.
కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తాము తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను ఉపాధ్యాయుల ప్రత్యక్ష ప్రమేయం లేకుండా స్వయంగా తల్లిదండ్రులకు వివరించి తమ ప్రతిభను చాటుకున్నారు. పాఠ్యాంశాలతో పాటు తమ అభ్యాస అనుభవాలను తల్లిదండ్రులతో పంచుకుంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్న వయసులోనే వేదికపై ధైర్యంగా మాట్లాడటం, విషయాలను స్పష్టంగా వివరించడం ద్వారా విద్యార్థులు ఆకట్టుకున్నారు.
**ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య మాట్లాడుతూ..** స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు సృజనాత్మక ఆలోచనా విధానం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. తాము నేర్చుకున్న విషయాలను స్వయంగా ఇతరులకు వివరించడం వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు కూడా పెంపొందుతాయని పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు.
విద్యార్థుల ప్రదర్శనలను తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకించి అభినందించారు. తమ పిల్లలు స్వయంగా నేర్చుకున్న అంశాలను స్పష్టంగా వివరించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం శ్రీనివాసులు, ఆర్ఐ కిరణ్‌కుమార్, కోఆర్డినేటర్ గాయత్రి, ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, హైస్కూల్ ఇన్‌చార్జ్ కేదార్, ఈ-కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ ఏ.ఓ. సర్ సురేష్ తదితరులతో పాటు 45 మందికి పైగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# దశాబ్దాల కలకు సాకారం దిశగా అడుగులుఎన్టీఆర్ నగర్, కొండమిట్ట ప్రాంతాల అర్హులందరికీ నివాస ధ్రువీకరణ పత్రాలు

**శ్రీకాళహస్తి , పెన్ పవర్, సెప్టెంబర్ 28:**
ఎన్నో దశాబ్దాలుగా నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న ఎన్టీఆర్ నగర్, కొండమిట్ట తదితర ప్రాంతాల పేద ప్రజల సొంత ఇంటి కల సాకారం దిశగా అడుగులు పడుతున్నాయని టీడీపీ నాయకులు తెలిపారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం శ్రీకాళహస్తి తహసీల్దార్ (ఎమ్మార్వో)ను కలిసి ఆయా ప్రాంతాల ప్రజలకు నివాస ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు.
22వ వార్డు ఇన్‌చార్జి నెమళ్లూరు బుజ్జి, 23వ వార్డు ఇన్‌చార్జి నాగమల్లి దుర్గాప్రసాద్, 24వ వార్డు ఇన్‌చార్జి బీమాల మునికృష్ణ, టీడీపీ నాయకులు వజ్రం కిషోర్, వినయ్ కుమార్ తదితరులు ఎమ్మార్వో కార్యాలయంలో అధికారితో సమావేశమై ప్రజల సమస్యలను వివరించారు.
ఈ సందర్భంగా ఎమ్మార్వో ఆయా ప్రాంతాల ప్రజల సమస్యలను పూర్తిగా విని సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సూచనల మేరకు సిబ్బందితో సర్వే నిర్వహించి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ నిబంధనల ప్రకారం నివాస ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.
అదేవిధంగా శ్రీకాళహస్తి పట్టణ టీడీపీ అధ్యక్షుడు గెడిపూడి విజయ్ కుమార్ ప్రజలకు ఇంటి పట్టాలు అందేలా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారని నాయకులు తెలిపారు.
ఎన్నో ఏళ్లుగా ఎన్టీఆర్ నగర్, కొండమిట్ట తదితర ప్రాంతాల్లో పేదలు ఇళ్లను నిర్మించుకుని జీవిస్తున్నారని, తమకు సొంత ఇంటి హక్కు కల్పించాలని ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని వారు కోరినట్లు తెలిపారు. ప్రజల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ఎమ్మెల్యే అసెంబ్లీ సమావేశాల్లోనూ ఆయా ప్రాంతాల సమస్యలను ప్రస్తావించినట్లు నాయకులు పేర్కొన్నారు.
ప్రస్తుతం నివాస ధ్రువీకరణ పత్రాల మంజూరుకు సర్వే నిర్వహించేందుకు అధికారులు సానుకూలంగా స్పందించడం పట్ల ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న తమ సమస్య పరిష్కార దిశగా కదులుతుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని నాయకులు తెలిపారు.





# బాలాజీ రైల్వే డివిజన్ సాధించే వరకు పోరాటం ఉద్యమానికి ఆటో యూనియన్ల సంపూర్ణ మద్దతు.. ప్రత్యక్షంగా పాల్గొంటామని హామీ





**తిరుపతి, పెన్ పవర్, సెప్టెంబర్ 28:**
తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కొనసాగుతున్న ఉద్యమానికి వివిధ ఆటో యూనియన్లు సంపూర్ణ సంఘీభావం ప్రకటించాయి. బాలాజీ రైల్వే డివిజన్ సాధన కోసం సాగుతున్న పోరాటానికి తమ వంతు సహకారం అందించడంతో పాటు, భవిష్యత్ కార్యాచరణలో ప్రత్యక్షంగా పాల్గొంటామని ఆటో యూనియన్ నాయకులు స్పష్టం చేశారు.
ఆదివారం బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ నివాసానికి తిరుపతి రైల్వే స్టేషన్, విష్ణు నివాసం, తిరుచానూరు రైల్వే స్టేషన్ల పరిధిలోని వివిధ ఆటో యూనియన్ నాయకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా గిరిధర్ కుమార్ చేపడుతున్న నిరంతర ఉద్యమాన్ని అభినందిస్తూ తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. రైల్వే డివిజన్ సాధన కోసం చేపట్టే రాబోయే పోరాటాల్లో ఐక్యంగా పాల్గొంటామని ముక్తకంఠంతో తెలిపారు.
తిరుపతి అభివృద్ధికి బాలాజీ రైల్వే డివిజన్ కీలకం
ఈ సందర్భంగా సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ మాట్లాడుతూ.. తిరుపతిని కేంద్రంగా చేసుకుని బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని అన్నారు. రైల్వే డివిజన్ ఏర్పాటుతో స్థానికంగా మౌలిక వసతులు మెరుగుపడటంతో పాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు.
వ్యాపారవేత్తలు, చిన్న తరహా వ్యాపారులు తమ కార్యకలాపాలను మరింత విస్తరించుకునే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. రోజువారీ ప్రయాణికులు, విద్యార్థులతో పాటు తిరుమల శ్రీవారి దర్శనానికి దేశ, విదేశాల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తులకు రైల్వే సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.
బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు కేవలం రైల్వే పరిపాలనా అంశం మాత్రమే కాదని, తిరుపతి ప్రాంత ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పన, వాణిజ్య విస్తరణ, రవాణా సౌకర్యాల మెరుగుదలకు ఇది కీలక అడుగుగా నిలుస్తుందని గిరిధర్ కుమార్ వివరించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.
ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటాం
గిరిధర్ కుమార్ వ్యాఖ్యలకు ఆటో యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బాలాజీ రైల్వే డివిజన్ సాధించే వరకు చేపట్టే ప్రజా ఉద్యమానికి అండగా ఉంటామని తెలిపారు. అవసరమైతే తమ యూనియన్ల సభ్యులతో కలిసి ప్రత్యక్ష ఆందోళనల్లో పాల్గొంటామని ప్రకటించారు. ఉద్యమాన్ని మరింత విస్తృతం చేసేందుకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో తిరుపతి రైల్వే స్టేషన్, విష్ణు నివాసం, తిరుచానూరు రైల్వే స్టేషన్ ఆటో యూనియన్ నాయకులు ఓబుల్ రెడ్డి, నవీన్, రైల్వే బాల, సూరి, రమేష్, వెంకటరమణ, కుమార్, గోవింద్ రెడ్డి, ప్రభాకర్ యాదవ్, పార్వతి, తులసి తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఫార్ములానే నన్ను గెలిపించింది: లోకేష్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎన్నికల్లో గెలుపు మజా ఇస్తుందని.. ఓడిపోతే.. నీరసం వస్తుందని మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. అయితే.. గెలుపుతోపాటు ఓటమిని కూడా బలంగా తీసుకోవాలని సూచించారు. 2019లో తాను ఓడిపోయినప్పుడు.. అనేక అవమానాలు ఎదురయ్యాయని తెలిపారు. అయితే.. వాటిని సవాలుగా తీసుకుని.. మళ్లీ ఓడిపోయిన చోటే పోటీ చేయాలని అనుకున్నట్టు తెలిపారు. ఎందుకు ఓడిపోయామో అధ్యయనం చేసి.. దానిని సరిచేసుకుని ముందుకు సాగానని చెప్పారు. ఇదే ఫార్ములా నాయకులకు వర్తిస్తుందన్నారు.ఓటమి తర్వాత కుంగిపోయి.. నియోజనకవర్గాలకు దూరంగా ఉంటే ఇబ్బందులు పెరుగుతాయన్నారు. తాను ఓడిపోయినా.. నియోజకవర్గంలో పర్యటించి ప్రజలను నిరంతరం కలుసుకుని.. వారికి హామీలు ఇచ్చానని గుర్తు చేసుకున్నారు. ఆ నమ్మకమే తనను 93 వేల ఓట్ల మెజారిటీతో గెలిచేలా చేసిందని లోకేష్ వివరించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఎటు చూసినా అభివృద్ధి కనిపిస్తోందన్నారు. ప్రతి విషయాన్నీ రాజకీయ కోణంలోనేకాకుండా.. ప్రజల కోణంలో తాను ఆలోచన చేస్తానన్నారు.తాజాగా సోమవారం ఉదయం మంగళగిరి నియోజకవర్గంలోని 347 మంది పేదలకు ఇళ్ల పట్టాలను నారా లోకేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పట్టాల సమస్య పరిష్కరిస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పట్టుదలతో పనిచేస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకు 2 వేల కోట్ల రూపాయల విలువైన ఇళ్ల పట్టాలను పేదలకు పంపిణీ చేశామని వివరించారు. ఇక ముందు కూడా ఈ యజ్ఞం కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా పట్టాదారులకు బట్టలు పెట్టి.. కానుకలు అందించారు. ఉచితంగానే రిజిస్ట్రేషన్ చేయించారు.

**చేసింది చెప్పాలి..**

ప్రతి ఎమ్మెల్యే తమ తమ నియోజకవర్గాల్లో పర్యటించాలని లోకేష్ పిలుపునిచ్చారు. చేసింది చెప్పుకోవాలన్నారు. ప్రభుత్వ పరంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని.. వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అదేసమయంలో ఎమ్మెల్యేలు వ్యక్తిగతంగా చేస్తున్న మంచిని కూడా ప్రజలకు వివరించాలని సూచించారు. టీడీపీ చేపట్టిన ఇంటింటికీ కార్యక్రమం హిట్ అయిందన్నారు. వచ్చే ఏడాది కూడా ఈ కార్యక్రమం మరోసారి సాగుతుందన్నారు. ఎన్నికల లోగా.. మూడు సార్లయినా.. ప్రతి మంత్రి, ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ తిరిగేలా ప్రజలకు మంచిని వివరించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు.

# బొత్స కోటలో మొదలైన ప్రకంపనలు.. టెన్షన్ లో పెద్దాయన!

**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ సీనియర్ నేత, మండలిలో విపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణకు సొంత నియోజకవర్గం చీపురుపల్లిలో రాజకీయం గట్టి సవాల్ విసురుతోందని అంటున్నారు. చీపురుపల్లి నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, దాదాపు 15 ఏళ్లపాటు మంత్రిగా పనిచేసిన బొత్స ఇప్పుడు తన రాజకీయ జీవితంలోనే ఎన్నడూ లేనంత విధంగా తిరుగుబాటు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. ముందుగా మేనల్లుడు చిన్న శ్రీను ఇచ్చిన షాక్ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటుండగా, ఇప్పుడు కేడర్ కూడా బొత్సకు బైబై చెప్పేస్తుండటం హాట్ టాపిక్ అవుతోంది.విజయనగరం జిల్లా చీపురుపల్లి బొత్స సొంత నియోజకవర్గం. ఇక్కడ నుంచి ఆయన మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2004, 2009, 2019ల్లో ఎమ్మెల్యేగా గెలిచిన బొత్స ఆ మూడు సార్లు మంత్రి పదవి దక్కించుకున్నారు. అమాత్య పదవితో జిల్లాలో తిరుగులేని ఆధిపత్యం చెలాయించడంతోపాటు రాష్ట్రస్థాయి నాయకుడిగానూ ఎదిగారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టి ఉత్తరాంధ్రలో మిగిలిన నాయకులు అందరికంటే ఎక్కువగా ప్రచారం దక్కించుకున్నారు. ఇక వైసీపీ చేరిన తర్వాత కూడా బొత్స హవాకు ఎదురు ఉండేది కాదని చెబుతున్నారు.2014 ఎన్నికల్లో ఓటమి తర్వాత 2015లో వైసీపీలో చేరిన బొత్స జిల్లాలో తన సొంత సామ్రాజ్యాన్ని మరింతగా విస్తరించుకున్నారని చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ ఉంటే.. విజయనగరం జిల్లాలో మాత్రం బొత్స పార్టీ అన్నట్లుగా రాజకీయాలు నడిపారు. ఈ క్రమంలోనే ఉత్తరాంధ్రపైనా పట్టుసాధించి గత ఎన్నికల్లో ఓడిపోయినా ఎమ్మెల్సీ సీటు దక్కించుకున్నారు. అయితే ఇప్పుడు స్థానిక ఎన్నికల ముందు బొత్స పూర్తిగా ఎదురుగాలి అనుభవిస్తున్నట్లు పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. తన కుమార్తెకు జడ్పీ చైర్మన్ పదవి అంటూ ఆయన చేసిన ప్రకటనతో మేనల్లుడు చిన్న శ్రీను వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరిపోగా, ఇప్పుడు బొత్స అనుచరులు కూడా చిన్న శ్రీను వెంట నడుస్తామని



రాజీనామా ప్రకటనలు చేస్తుండటం ప్రకంపనలు రేపుతోందని చెబుతున్నారు.జడ్పీ మాజీ చైర్మన్ చిన్నశ్రీనుకు మద్దతుగా వైసీపీకి చెందిన ఐదుగురు జడ్పీటీసీ మాజీ సభ్యులు ఒకేసారి వైసీపీని వీడుతున్నట్లు ప్రకటించగా, ఆదివారం బొత్స సొంత నియోజకవర్గంలోని మెరకముడిదాం మండలంలో దాదాపు 13 గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు పార్టీతో తెగతెంపులు చేసుకుంటున్నట్లు ప్రకటించారు. వీరి రాజీనామాతో ఆయా గ్రామాల్లో వైసీపీ తరఫున పోటీచేయడానికి సరైన నాయకుడు లేని పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. ఇదేవిధంగా గరివిడి, గుర్ల, చీపురుపల్లి మండలాల్లో కూడా త్వరలో రాజీనామాలు ఉంటాయని చెబుతున్నారు.ఇలా సొంత నియోజకవర్గంలో బొత్స పునాదులు కదిలేలా పావులు కదుపుతున్న చిన్న శ్రీను జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లోనూ తన అనుచరులను టీడీపీలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్న ప్రచారం రాజకీయాన్ని మరింత వేడెక్కిస్తోంది. ముఖ్యంగా తన మేనమామలు అయిన బొత్స సత్యనారాయణతోపాటు ఆయన సోదరుడు బొత్స అప్పలనరసయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న చీపురుపల్లి, గజపతినగరం నియోజకవర్గాల్లో వైసీపీ నుంచి భారీ వలసలు ఉండేలా చిన్నశ్రీను పాచికలు వేస్తుండటమే హాట్ టాపిక్ అవుతోంది. చిన్న శ్రీను దూకుడుకి బొత్స కళ్లెం వేయాలని, లేనిపక్షంలో వైసీపీ పార్టీ తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని కార్యకర్తలు కోరుకుంటున్నారు. అటు బొత్స కూడా నష్టనివారణకు ఎన్నడూ లేనివిధంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారని చెబుతున్నారు. ఏదిఏమైనా అధికార పార్టీలో చేరడంతో చిన్నశ్రీనుకు అన్నివిధాలా కలిసివస్తుందని చెబుతున్నారు.

# మెగా బ్యాక్ స్టెప్...

**కడప, సెప్టెంబర్ 28, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ పునరుత్పాదక ఇంధన రంగంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అన్నమయ్య జిల్లా కొమ్మూరు సమీపంలో ప్రముఖ మౌలిక వసతుల కల్పన సంస్థ మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్‌కు కేటాయించిన భారీ 2,000 మెగావాట్ల పంప్డ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్ట్‌ను రద్దు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. పర్యావరణపరమైన, భౌగోళికపరమైన అడ్డంకుల దృష్ట్యా ఈ ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో చేపట్టడం సాధ్యం కాదని, అందువల్ల ప్రాజెక్ట్ కేటాయింపును రద్దు చేయాలని స్వయంగా మేఘా సంస్థే ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేయడంతో కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో 2022-2023 కాలంలో రాష్ట్రంలో భారీ ఎత్తున పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేశారు. పర్యావరణహిత హరిత ఇంధన నిల్వ విధానంలో భాగంగా అన్నమయ్య జిల్లా సంబేపల్లి పరిసర ప్రాంతాల్లోని కొమ్మూరు వద్ద 2 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ను న్యూ , రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ద్వారా మేఘా సంస్థకు కేటాయించారు. భారీ ఎత్తున పెట్టుబడులు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయనే ప్రచారంతో నాడు అనుమతులు వేగంగా మంజూరైనప్పటికీ.. ప్రాథమిక సర్వే దశలోనే అసలైన పర్యావరణ చిక్కులు తెరపైకి వచ్చాయి.ప్రాజెక్టు రద్దుకు గల ప్రధాన సాంకేతిక, పర్యావరణ కారణాలను పరిశీలిస్తే.. ప్రతిపాదిత కొమ్మూరు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ అత్యంత సున్నితమైన పర్యావరణ పరిధిలోకి వస్తోంది. ఈ ప్రాజెక్ట్ కోసం గుర్తించిన ఎగువ, దిగువ జలాశయాలు , ప్రసార మార్గాలు నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ విస్తరణ ప్రాంతాలు, పరిసర అటవీ శ్రేణులు, శ్రీ లంకమల్లేశ్వర వన్యప్రాణి అభయారణ్యం పరిధిలోకి వస్తున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం పులుల సంరక్షణ కేంద్రాలు, రక్షిత అటవీ ప్రాంతాల్లో ఇంతటి భారీ తవ్వకాలు, సొరంగాల నిర్మాణం, జల నిల్వలకు అనుమతులు లభించడం దాదాపు అసాధ్యం. తీవ్రమైన అటవీ, వన్యప్రాణి ఆంక్షల వల్ల ప్రాజెక్ట్ సాధ్యపడదని మేఘా సంస్థ నిర్ధారించుకుంది.జాతీయ వన్యప్రాణి బోర్డు నుంచి క్లియరెన్సులు సాధించడం సాధ్యం కాకపోవడం, చట్టపరమైన వివాదాలు తలెత్తే ముప్పు ఉండటంతో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లలేమని మేఘా సంస్థ చేతులెత్తేసింది. ఈ మేరకు సంస్థ చేసిన అభ్యర్థనను క్షుణ్ణంగా పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం.. కేటాయింపులను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. కాగితాలపై ఎలాంటి క్షేత్రస్థాయి పర్యావరణ అధ్యయనాలు చేయకుండా గత ప్రభుత్వ హయాంలో గుడ్డిగా అనుమతులు ఇవ్వడం వల్లే ఇప్పుడు ప్రాజెక్టులు అర్థాంతరంగా రద్దవుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**దాల్మియాకు భూ కేటాయింపులు**

రాయలసీమ పారిశ్రామిక హబ్‌గా మారుతున్న వైఎస్సార్ కడప జిల్లాలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం, కడప జిల్లాలో ప్రముఖ సిమెంట్ తయారీ సంస్థ 'దాల్మియా సిమెంట్స్' భారీ విస్తరణ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో

భాగంగా పరిశ్రమ విస్తరణకు అవసరమైన 250 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.మైలవరం మండలం చిన్నకొమ్మర్ల గ్రామ పరిధిలో ఉన్న దాల్మియా సిమెంట్స్ ప్లాంట్ విస్తరణకు ఈ భూమిని కేటాయించారు. అయితే ఈ కేటాయింపుల్లో ప్రభుత్వం అత్యంత పారదర్శక విధానాన్ని అవలంబించింది. సాధారణంగా పరిశ్రమలకు ఇచ్చే రాయితీలు కాకుండా, వాస్తవ ఖరీదు ప్రాతిపదికన మాత్రమే ఈ 250 ఎకరాల భూమిని సంస్థకు బదిలీ చేయడం విశేషం. పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తూనే, ప్రభుత్వ ప్రయోజనాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు.ఈ భూ కేటాయింపు మరియు కొత్త యూనిట్ స్థాపనతో దాల్మియా సిమెంట్స్ తన వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుకోనుంది. ప్రస్తుతం ఉన్న 7.23మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యం) నుండి ఏకంగా 9.60 కు ఉత్పత్తిని పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. దీంతో ఈ ప్లాంట్ దక్షిణ భారతదేశంలోనే దాల్మియా గ్రూప్‌నకు చెందిన అత్యంత పెద్ద ఇంటిగ్రేటెడ్ ప్యాక్టరీగా రూపాంతరం చెందబోతోంది.

# జగన్ మరో పరామర్శయాత్ర.. పోలీసులు ఏమన్నారంటే!



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ అధినేత జగన్.. ఇటీవల కాలంలో తన పార్టీ నాయకులను పరామర్శించేందుకు బయటకు వస్తున్నారు. వివిధ కేసుల్లో చిక్కుకుని జైలు జీవితం గడుపుతున్న వారిని ఆయన పలకరిస్తున్నారు. అయితే ఈ పరామర్శలు.. యాత్రగా మారుతున్నాయి. అదేసమయంలో బలప్రదర్శనగా కూడా మారుతున్నాయి. దీంతో జగన్ యాత్రలకు వచ్చే వారిని నియంత్రించడం.. పోలీసులకు కూడా సవాల్‌గా మారుతోంది. దీంతో అనుమతులు కూడా ఇవ్వడం లేదు. ఇక, తాజాగా జగన్ మరో పరామర్శయాత్రకు రెడీ అయ్యారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన వైసీపీ నాయకుడు కాకుమాను రాజశేఖర్ ఇటీవల మృతి చెందారు. విజయవాడ లో వైసీపీ నేతలు నిర్వహించిన డీఎస్సీ-2025పైనిరసనలో ఆయన కూడా పాల్గొన్నారు. అనంతరం.. ఇంటికి వెళ్లిన తర్వాత.. గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఈ ఘటన జరిగి రెండు మూడు రోజులు అయిపోయింది. అయితే.. తాజాగా రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ రెడీ అయ్యారు. దీనికి సంబంధించి ప్రకాశం ఎస్పీకి నాయకులు వినతి ఇచ్చారు.

**షరతులు ..**

వైసీపీ అధినేత జగన్.. మంగళవారం ఉదయం ఒంగోలు వచ్చి.. కాకుమాను కుటుంబాన్ని పరామర్శించేందుకు పోలీసులు ఓకే చెప్పారు. అయితే.. ఎలాంటి ర్యాలీలు, ప్రదర్శనలు.. చేయడానికి వీల్లేదన్నారు. అలాగే.. బ్యానర్లు, ప్లకార్డులు బైక్ ర్యాలీలు చేయరాదని కూడా తేల్చి చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే.. కేసులు తప్పవని హెచ్చరించారు. అయితే.. ఇప్పటివరకు జగన్ చేసిన యాత్రలను గమనిస్తే.. పోలీసులు ఆంక్షలు విదించడం.. నాయకులు ఉల్లంఘించడం కామనైపోయిందన్న విషయం తెలిసిందే.

**ఎవరీ కాకుమాను?**

వైసీపీ హయాంలో కాకుమాను రాజశేఖర్.. ఆంధ్రప్రదేశ్ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశా రు. ఇటీవలి వరకు వైసీపీ రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షుడిగా, పార్టీ అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తిం చారు. ఈ నెల 22న విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద డీఎస్సీ పై వ్యతిరేకంగా చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొన్నా రు. అనంతరం. . ఆయన గుండెపోటుతో మృతి చెందారు. పార్టీలో సీనియర్ నేతగానే కావడంతో.. వచ్చే ఎన్నికల్లో ఒంగోలు నియోజకవర్గం అభ్యర్థిగా కూడా ఆయన పేరు పరిశీలనలో ఉందని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.

## వైసీపీ ట్రాప్ లో లోకేశ్...

**రాజమండ్రి, సెప్టెంబర్ 28, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీ చుట్టూ జరుగుతున్న రాజకీయ పోరు తీవ్ర స్థాయికి చేరింది. ఈ అంశం వెనుక వైసీపీ రాజకీయ అస్త్రాలు, వ్యూహాలు ఉన్నాయనే విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా, విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ లక్ష్యంగా మరియు మిత్రపక్షాలైన టీడీపీ-బీజేపీ-జనసేన మధ్య సమతుల్యతను దెబ్బతీసే విధంగా ఈ వివాదాన్ని సజీవంగా ఉంచేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నారా లోకేశ్ లక్ష్యంగా వ్యూహంకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి నియామక ప్రక్రియను వేగవంతం చేసింది. అయితే, నియామకాలు పూర్తయిన తర్వాత ఈ ప్రక్రియలో, ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా, పేపర్ లీకేజీ మరియు టెట్ అర్హతలలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ ఆరోపిస్తోంది. గవర్నర్ కు కూడా ఫిర్యాదు చేశారు. ఎన్ని కేసులు పెట్టినా యుద్ధం ఆగదని జగన్ స్పష్టం చేయడంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎదుట టీడీపీని పలుచన చేయాలని భావిస్తున్నట్లుంది.. విద్యా శాఖకు మంత్రిగా ఉన్న నారా లోకేశ్ ను నేరుగా టార్గెట్ చేయడం ద్వారా ఆయన రాజకీయ ప్రతిష్టను దెబ్బతీయడం వైసీపీ ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది.ఈ వ్యవహారంపై లోకేష్ రాజీనామా చేయాలని, సీబీఐ దర్యాప్తు జరిపించాలని జగన్ మోహన్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. బీజేపీ ఎదుట టీడీపీని పలుచన చేసే వ్యూహమా?రాజకీయ విశ్లేషకుల ప్రకారం, వైసీపీ ఈ అంశాన్ని ఇంత పెద్ద ఎత్తున లేవనెత్తడం వెనుక కేంద్రంలో ఉన్న బీజేపీ పెద్దల దృష్టిని ఆకర్షించే వ్యూహం కూడా ఉండవచ్చు. పరిపాలనా లోపాలను ఎత్తిచూపడంతో అవినీతి రహిత, పారదర్శక పాలన అందిస్తామని కేంద్రానికి హామీ టీడీపీ ఇచ్చింది. రాష్ట్రంలో మొదటి పెద్ద రిక్రూట్‌మెంట్‌లోనే అక్రమాలకు పాల్పడిందనే ఇంప్రెషన్‌ను బీజేపీ హైకమాండ్ ముందు ఉంచాలని వైసీపీ భావిస్తుండవచ్చు.అందుకే మెగా డీఎస్సీని వదలకుండా పట్టుకుని బీజేపీ దృష్టిలో లోకేశ్ ను పలుచన చేస్తే ఆ ప్రభావం కూటమిపై పడుతుందని వైసీపీ అంచనా వేస్తున్నట్లు అనిపిస్తుంది. రాష్ట్ర దర్యాప్తు సంస్థలపై నమ్మకం లేదని, కేవలం సీబీఐ విచారణ ద్వారానే నిజాలు బయటపడతాయని జగన్ పదే పదే ట్వీట్లు మరియు ప్రెస్ మీట్ల ద్వారా ఒత్తిడి పెంచుతున్నారు. దీని ద్వారా కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య, ముఖ్యంగా టీడీపీ-బీజేపీ బంధంలో ఒక రకమైన ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టించవచ్చునేది విపక్షాల అంతర్గత అంచనాగా కనిపిస్తోంది. గత వైసీపీ హయాంలో సరైన ఉద్యోగ నోటిఫికేషన్లు రాలేదనే అసంతృప్తి నిరుద్యోగుల్లో ఉందనే విమర్శలను కౌంటర్ చేయడానికి ఈ అంశం ఉపయోగపడుతుందని వైసీపీ భావిస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటైన మెగా డీఎస్సీపై 'అక్రమాల మరక' వేయడం ద్వారా మైలేజ్ పొందాలని ప్రతిపక్షం భావిస్తోంది. నిరుద్యోగ యువతలో కూటమి ప్రభుత్వంపై నమ్మకాన్ని సడలించేలా ప్రచారం చేయడం కూడా ఇందులో భాగమే. వైసీపీ చేస్తున్న ఆరోపణలను అధికార టీడీపీ తీవ్రంగా ఖండిస్తోంది. ఇదంతా కేవలం "దుష్ప్రచార వ్యూహం" అని కొట్టిపారేస్తోంది. మరి బీజేపీ దృష్టిలో టీడీపీని పలుచన చేయాలన్న వైసీపీ వ్యూహం ఎంత మేరకు పలుచన చేస్తుందన్నది చూడాలి.

# గ్రామకంఠం భూములపై సీఆర్డీఏ క్లారిటీ.. మినహాయింపులకు కటాఫ్ తేదీ ఇదే

**విజయవాడ, సెప్టెంబర్ 28, పెన్ పవర్:** ఏపీ రాజధాని అమరావతి పరిధిలోని గ్రామకంఠం మినహాయింపులపై సీఆర్డీఏ శనివారం స్పష్టత ఇచ్చింది. 08-12-2014ను కటాఫ్ తేదీగా నిర్ణయించి.. ఆ తేదీకి ముందే నిర్మాణాలు ఉన్న భూములు, చదరపు గజాల ప్రాతిపదికన రిజిస్ట్రేషన్లు చేసుకున్న ప్లాట్లను నిబంధనల ప్రకారం మినహాయింపునకు పరిశీలన చేసినట్లు తెలిపింది. గ్రామ నివాస ప్రాంతానికి దూరంగా ఉన్న ఖాళీ వ్యవసాయ భూములు, కటాఫ్ తర్వాత రిజిస్ట్రేషన్లు జరిగిన భూములకు మినహాయింపు వర్తించదని సీఆర్డీఏ తెలిపింది. ఇప్పటికే 6,473.72 ఎకరాలను ఎల్‌పీఎస్ నుంచి మినహాయించినట్లు సీఆర్డీఏ తెలిపింది. కమిటీకి వచ్చిన 685 దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన చేసినట్లు పేర్కొంది. రికార్డులు, శాటిలైట్ చిత్రాలు, రిజిస్ట్రేషన్ ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. తాజా అప్లికేషన్లు, అభ్యంతరాలను జేసీ ఆధ్వర్యంలోని కమిటీ పరిశీలించి ఖరారు చేస్తుందని సీఆర్డీఏ ఓ ప్రకటనలో తెలిపింది. అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం అన్ని ప్రయోజనాలు అందిస్తామని తెలిపింది. విజయవాడలో దశాబ్దాల నాటి ఇళ్ల పట్టాల సమస్యకు ఏపీ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించింది. పేదల సొంతింటి కలకు భరోసా కల్పించేందుకు రెడీ అయింది. విశాఖలో 28,445 కుటుంబాలకు పట్టాలిచ్చిన తరహాలో ఈనెల 30న విజయవాడలో మరో భారీ కార్యక్రమం చేపట్టనుంది. 24,057 కుటుంబాలకు రూ.9,800 కోట్ల విలువైన భూమిపై క్రమబద్ధీకరణ పట్టాలను సీఎం చంద్రబాబు అందించనున్నారు. ఎన్టీఆర్ హయాంలో ఇచ్చిన పట్టాలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ పేదల సొంతింటి కలను నెరవేర్చనున్నారు. ఇళ్ల పట్టాల పంపిణీతో ఒక్కో కుటుంబానికి సుమారు రూ.40 లక్షల నుంచి రూ.45 లక్షల వరకు ప్రయోజనం చేకూరనుంది. తమ ఇళ్లకు శాశ్వత హక్కులు కల్పించాలని ఎన్నో ఏళ్లుగా పేద ప్రజలు కోరుతున్నారు. వారి కల సాకారం నేడు సాకారం కానుంది. ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలో ఇళ్ల పట్టాల పంపిణీ జరగనుంది. మొత్తం 15 మండలాల్లోని 617 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 29.86 లక్షల చదరపు గజాల స్థలాలపై లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేయనుంది.

# సచిన్‌తో పోలిక నాకొద్దు.. ఆయన ఒక లెజెండ్: కోహ్లీ

- వెస్టిండీస్‌పై సెంచరీతో చెలరేగిన విరాట్ కోహ్లీ
- క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ రెండు రికార్డులు బద్దలు
- వన్డేల్లో అత్యంత వేగంగా 15వేల పరుగులు పూర్తి చేసిన బ్యాటర్‌గా కోహ్లీ ఘనత
- భారత్ గడ్డపై వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కొత్త చరిత్ర
- సచిన్‌తో పోలికపై స్పందన.. అతడి స్థానం ఎప్పటికీ ప్రత్యేకం అన్న విరాట్




టీమిండియా స్టార్ బ్యాటర్, రన్ మెషీన్ విరాట్ కోహ్లీ తన పరుగుల దాహాన్ని కొనసాగిస్తున్నాడు. వెస్టిండీస్‌తో నిన్న తిరువనంతపురంలో జరిగిన మొదటి వన్డేలో అద్భుత శతకంతో చెలరేగిన కోహ్లీ, భారత జట్టుకు ఘన విజయాన్ని అందించడమే కాకుండా.. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న రెండు ప్రధాన రికార్డులను బద్దలు కొట్టాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లీ కేవలం 88 బంతుల్లోనే 139 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ ఇన్నింగ్స్‌లో భాగంగా కోహ్లీ వన్డే క్రికెట్‌లో 15,000 పరుగుల మైలురాయిని అందుకున్న రెండో బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఇంతకుముందు సచిన్ మాత్రమే ఈ ఘనత సాధించాడు. అయితే, కోహ్లీ కేవలం 303 ఇన్నింగ్స్‌లలోనే ఈ మార్కును చేరగా, సచిన్‌కు దీనికోసం 377 ఇన్నింగ్స్‌లు అవసరమయ్యాయి. అంటే.. సచిన్ కంటే 74 ఇన్నింగ్స్‌లు తక్కువ ఆడి ఈ రికార్డును కోహ్లీ సొంతం చేసుకోవడం విశేషం. ఇదే మ్యాచ్‌లో కోహ్లీ మరో అరుదైన రికార్డును కూడా అధిగమించాడు. భారత గడ్డపై వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా సచిన్ (6,976) పేరిట ఉన్న రికార్డును కోహ్లీ బ్రేక్ చేశాడు. ఈ మ్యాచ్‌తో కోహ్లీ స్వదేశంలో 7,006 పరుగులు పూర్తి చేసి అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఇది కోహ్లీకి వన్డేల్లో 55వ సెంచరీ కాగా, లిస్ట్-ఏ క్రికెట్‌లో 60వ శతకం. ఈ క్రమంలో లిస్ట్-ఏ సెంచరీల విషయంలోనూ సచిన్ రికార్డును సమం చేశాడు. మ్యాచ్ అనంతరం తన రికార్డులు, సచిన్‌తో పోలికలపై కోహ్లీ వినమ్రంగా స్పందించాడు. “నాకు సచిన్ పాజీ ఎప్పటికీ సచిన్ పాజీనే. అతను తన కాలంలో ఆటలో విప్లవాత్మక మార్పులు తెచ్చాడు. అది సంఖ్యలు, పోలికలకు అతీతమైన విషయం. ప్రజలపై అతను చూపిన ప్రభావం ఎప్పటికీ నిలిచిపోతుంది” అని వ్యాఖ్యానించాడు.

# ఆసియా క్రీడలు: వర్షంతో మ్యాచ్ రద్దు.. నేరుగా సెమీస్‌కు టీమిండియా

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా క్రీడల్లో భారత్, ఆఫ్ఘనిస్థాన్ జట్ల మధ్య జరగాల్సిన రెండో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. దీంతో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానంలో ఉన్న టీమిండియా నేరుగా సెమీఫైనల్స్‌కు అర్హత సాధించింది. కరోగి స్పోర్ట్స్ పార్క్‌లో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో టాస్ కూడా వేయకుండానే మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. ఉదయం 5:30 గంటలకు జరగాల్సిన పాకిస్థాన్-హాంకాంగ్ తొలి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ కూడా ఇదే కారణంతో రద్దయింది. ఆ మ్యాచ్‌లోనూ అధిక ర్యాంకింగ్ ఆధారంగా పాకిస్థాన్ సెమీస్‌కు చేరుకుంది. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత్ నంబర్ 1 స్థానంలో ఉండగా.. ఆఫ్ఘనిస్థాన్ 10వ స్థానంలో ఉంది. మరోవైపు పాకిస్థాన్ 6వ ర్యాంకులో, హాంకాంగ్ 24వ ర్యాంకులో కొనసాగుతున్నాయి. ఈ నిబంధనల ప్రకారమే భారత్, పాక్ జట్లు ముందంజ వేశాయి. సెమీఫైనల్లో శ్రీలంక, నేపాల్ మధ్య జరిగే మూడో క్వార్టర్ ఫైనల్ విజేతతో భారత్ తలపడుతుంది. మరో సెమీస్‌లో బంగ్లాదేశ్, మలేషియా మధ్య జరిగే నాలుగో క్వార్టర్ ఫైనల్ విజేతతో పాకిస్థాన్ పోటీ పడుతుంది. మిగిలిన క్వార్టర్ ఫైనల్స్ మంగళవారం, సెమీఫైనల్స్ గురువారం జరగనున్నాయి.



# భారత జట్టులో నో ఛాన్స్.. రెస్టాఫ్ ఇండియా కెప్టెన్ రిషబ్.. శ్రీనగర్ ఫ్లైట్ ఎక్కిన పంత్ మావా!

**హైదరాబాద్ పెన్ పవర్:** రాబోయే ఇరానీ కప్ 2026-27 కోసం రెస్టాఫ్ ఇండియా కెప్టెన్ రిషబ్ పంత్ ఈరోజు (సోమవారం, సెప్టెంబర్ 28) న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి శ్రీనగర్‌కు బయలుదేరారు. రంజీ ట్రోఫీ ఛాంపియన్స్ గా నిలిచిన జమ్ము అండ్ కశ్మీర్‌తో జరగనున్న ఐదు రోజుల ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లో రెస్టాఫ్ ఇండియా జట్టుకు పంత్ నాయకత్వం వహించనున్నారు. ఈ మ్యాచ్ అక్టోబర్ 1 (గురువారం) నుంచి ప్రారంభంకానుంది. భారత జట్టు త్వరలో ఆడబోయే న్యూజిలాండ్ టెస్ట్ సిరీస్‌కు సన్నద్ధమవుతున్న తరుణంలో, ఈ ఐదు రోజుల మ్యాచ్ రిషబ్ పంత్‌కు రెడ్-బాల్ క్రికెట్‌లో తగినంత రిథమ్, మ్యాచ్ ప్రాక్టీస్‌ను అందించనుంది.




**జమ్ము అండ్ కశ్మీర్ తొలి ప్రదర్శన:**
ఈ ప్రతిష్టాత్మక దేశీయ ఫస్ట్-క్లాస్ టోర్నమెంట్‌లో జమ్ము అండ్ కశ్మీర్ జట్టు అడుగుపెట్టడం ఇదే మొదటిసారి కావడం విశేషం. కాగా తొలిసారి ఆడబోతున్న ఇరానీ కప్ 2026-27ని సొంతం చేసుకోవాలని జమ్ము టీమ్ ప్లాన్ చేస్తుండగా.. పంత్ తనదైన వ్యూహాలతో బరిలోకి దిగబోతున్నాడు. మరోవైపు, భారత క్రికెట్ నియంత్రణ మండలి ( సెప్టెంబర్ 16 నాడు 15 మంది సభ్యులతో కూడిన రెస్టాఫ్ ఇండియా జట్టును ప్రకటించింది. వెన్నునొప్పి గాయం నుంచి కోలుకుంటున్న ఆకాశ్ దీప్ ఫిట్‌నెస్ క్లియరెన్స్‌కు లోబడి జట్టులో చోటు దక్కించుకున్నారు.

**ఇరానీ కప్ 2026 మ్యాచ్ వివరాలు:**
మ్యాచ్: జమ్ము & కశ్మీర్ ‌ఒం రెస్టాఫ్ ఇండియా, ఇరానీ కప్ 2026-27.
తేదీ: గురువారం, అక్టోబర్ 1 నుండి సోమవారం, అక్టోబర్ 5, 2026 వరకు.
వేదిక: శ్రీనగర్, జమ్ము & కశ్మీర్.
ఎడిషన్: 63వది.
రెస్టాఫ్ ఇండియా కెప్టెన్: రిషబ్ పంత్.
రెస్టాఫ్ ఇండియా వైస్ కెప్టెన్: సర్ఫరాజ్ ఖాన్.
జమ్ము & కశ్మీర్ కెప్టెన్: పరాస్ డోగ్రా.

**రెస్టాఫ్ ఇండియా జట్టు:**
రిషబ్ పంత్ (కెప్టెన్‌లి/వికెట్ కీపర్), సనత్ సాంగ్వాన్, శిఖర్ మోహన్, సుదీప్ ఘరామి, సర్ఫరాజ్ ఖాన్ (వైస్ కెప్టెన్), స్మరన్ రవిచంద్రన్, మానవ్ సుతార్, శరన్ష్ జైన్, ఆకాష్ దీప్‌లి, ముఖేష్ కుమార్, ముఖేష్ చౌదరి, ఆర్యన్ జుయల్ (ఔఖ), ఆర్యన్ పాండే, అనుకుల్ రాయ్, ఆయుష్ దోసెజా

# నెట్ వర్త్ లిస్ట్ లో లేకుంటే ఏంటి?.. మంచి మనసుతోనే..



రెబల్ స్టార్ ప్రభాస్ పేరు పెద్ద పెద్ద నెట్ వర్త్ లిస్టుల్లో కనిపించకపోవచ్చు. ఆయన సంపాదన ఎంత అనేది కూడా బయట ప్రపంచానికి పూర్తిగా తెలియకపోవచ్చు. కానీ మంచి పనులు చేసే విషయంలో మాత్రం ప్రభాస్ ఎప్పుడూ ముందే ఉంటారు. సంపాదించిన దాంట్లో కొంత భాగాన్ని అవసరంలో ఉన్నవారికి అందిస్తూ తన మంచి మనసును చాటుకుంటున్నారు.

సినిమాల పరంగా ప్రభాస్ రేంజ్ ఏంటో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బాహుబలి తర్వాత ఆయన రేంజ్ పూర్తిగా మారిపోయింది. వరుసగా పాన్ ఇండియా సినిమాలు చేస్తూ దేశవ్యాప్తంగా భారీ మార్కెట్ ను సొంతం చేసుకున్నారు. ఒక్కో సినిమాకు వందల కోట్ల రెమ్యూనరేషన్ తీసుకుంటున్నారనే వార్తలు కూడా చాలాకాలంగా వినిపిస్తున్నాయి. అయితే ఒక నటుడి రెమ్యూనరేషన్, నెట్ వర్త్ రెండూ ఒకటి కాదు. సినిమాల ద్వారా వచ్చిన డబ్బులో టాక్సులు, ఖర్చులు, పెట్టుబడులు, కుటుంబ బాధ్యతలు ఇలా ఎన్నో ఉంటాయి. అందుకే బయట కనిపించే లెక్కలతో ఒక స్టార్ అసలు సంపదను అంచనా వేయడం అంత ఈజీ కాదు. ప్రభాస్ విషయంలో మరో విషయం ఎక్కువగా కనిపిస్తుంది. ఆయన చేసే సేవా కార్యక్రమాలు. ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు భారీ మొత్తాల్లో విరాళాలు అందించారు. తెలుగు రాష్ట్రాల్లో వరదల సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్స్ కు సాయం చేశారు. కేరళలో వయనాడ్ విపత్తు సమయంలో కూడా బాధితుల కోసం విరాళం ఇచ్చారు. కరోనా సమయంలోనూ ప్రభాస్ భారీ మొత్తంలో ఆర్థిక సాయం చేశారు. కేంద్రంతో పాటు తెలుగు రాష్ట్రాల సహాయ నిధులకు విరాళాలు అందించారు. ఆ సమయంలో సినిమా కార్మికులు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు కూడా అండగా నిలిచారు. కరోనా క్రైసిస్ ఛారిటీకి సాయం చేశారు. సినిమా రంగానికి మాత్రమే కాకుండా పర్సనల్ గా కూడా అవసరంలో ఉన్నవారికి ప్రభాస్ సాయం చేసిన సందర్భాలు ఉన్నాయి. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారికి వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం చేసినట్లు పలు సందర్భాల్లో వార్తలు వచ్చాయి. పర్యావరణం విషయంలో కూడా ప్రభాస్ తన వంతు బాధ్యత తీసుకున్నారు. హైదరాబాద్ సమీపంలోని కాజిపల్లి అర్బన్ ఫారెస్ట్ ప్రాంతాన్ని దత్తత తీసుకుని దాని అభివృద్ధికి కోపరేట్ చేశారు. పచ్చదనం పెంచే కార్యక్రమాల్లోనూ భాగమయ్యారు. ప్రభాస్ చేసే ప్రతి సాయం పెద్దగా ప్రచారంలోకి రావాలని ఆయన కోరుకోరనే పేరుంది. కొన్ని సందర్భాల్లో ఆయన చేసిన సహాయం బయటకు వచ్చిన తర్వాతే అభిమానులకు విషయం తెలుస్తుంది. అందుకే ప్రభాస్ అభిమానులు ఆయనను స్క్రీన్ పై మాత్రమే కాదు.. నిజ జీవితంలో కూడా బాహుబలిగా చూస్తుంటారు. నెట్ వర్త్ లిస్టులో పేరు ఉందా లేదా అనేది పక్కన పెడితే.. సంపాదనలో కొంత భాగాన్ని అవసరంలో ఉన్నవారికి ఇవ్వడం, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడం కూడా ఒక వ్యక్తి వాల్యూను చూపిస్తుంది. అందుకే నెట్ వర్త్ లిస్టుల్లో పేరు లేకపోయినా.. మంచి పనులతో మాత్రం ప్రభాస్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు.





Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D.No:10-11G-60/1, Flat No.4, Keelapatla Road Cross, Bangalore ByPass Road,Gangavaram MDL,Palamaneru Chittoor Dist, Editor Gantyada Apparao. PRGI Registration No. " APTEL/25/A4274 " e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965